www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru |

73 రోజులు.. రూ. 363.25 కోట్లు

పురాల్లో పన్ను బకాయిలు రూ.363.25 కోట్లు.. 73 రోజుల్లో వసూలు చేయాలి. సెలువు దినాల్లోనూ మున్సిపల్ ఉద్యోగులు పని చేస్తే రోజుకు రూ.4.97 కోట్లు వసూలు చేయాలి. లేదంటే నూరు శాతం పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరదు. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో అధికారుల పనితీరు చూస్తే నిర్దేశించిన లక్ష్యాల మేర పన్నుల వసూళ్లపై అనుమానాలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా అధికారులు అలసత్వం వీడకపోవడం వల్లే బకాయిలు పేరుకుపోతున్నాయని అర్థమవుతోంది. తాజాగా మున్సిపల్ పరిపాలన డైరెక్టర్(డీఎంఏ) నూరు శాతం పన్ను వసూలు చేయాలని పుర అధికారులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయినా వారిలో ఆశించిన మేర స్పందన కానరావడంలేదన్న ఆరోపణలున్నాయి. పన్ను వసూలు జరుగుతున్న తీరు నూరు శాతం సాధించేదిగా లేదనే చెప్పాలి. మున్సిపాల్టీలలో రెవెన్యూ విభాగం, వార్డు సచివాలయ కార్యదర్శులు ఇలా సిబ్బంది పుష్కలంగా ఉన్నా పన్ను వసూళ్లలో చతికిల పడుతున్నారన్న విమర్శలున్నాయి.



రాష్ట్రంలోనే అత్యధికంగా పన్ను వసూలుచేసిన వినుకొండ మున్సిపాలిటీ

ఆస్తి పన్ను వసూళ్లు(రూ.కోట్లలో)..

మున్సిపాలిటీ	వసూలు	వసూలు	శాతం
పల్నాడు జిల్లా :-			
నరసరావుపేట	17.86	7.14	40.01
చిలకలూరిపేట	17.21	4.82	28.03
వినుకొండ	5.14	4.56	88.58
సత్తెనపల్లి	7.71	3.21	41.61
మాచర్ల	5.98	2.71	45.33
పిడుగురాళ్ల	5.72	3.56	62.17
దాచేపల్లి	2.14	1.18	55.07
గురజాల	1.56	0.72	46.27
బాపట్ల జిల్లా :-			
రేపల్లె	5.71	3.31	57.85
బాపట్ల	13.18	4.36	33.10
అద్దంకి	5.01	3.11	61.97
చీరాల	12.41	6.82	54.92
గుంటూరు జిల్లా :-			
గుంటూరు కార్పొరేషన్	296.11	89.26	30.14
పొన్నూరు	6.12	3.39	55.40
మంగళగిరి-తాడేపల్లి	37.24	26.88	72.18
తెనాలి	26.85	12.07	44.95

- పురాల్లో పన్ను వసూలు సాధ్యమేనా
- రోజుకు రూ.4.97 కోట్లు వసూలు లక్ష్యం
- పన్నుల వసూళ్ల తీరుపై డీఎంఏ ఆగ్రహం
- బకాయిలపై మున్సిపల్ అధికారుల సాగదీత
- వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ స్థానం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పన్నులు.. పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు. ఆరు నెలలకు ఒకసారి ప్రజల నుంచి ఆస్తి, నీటి పన్నుల రూపంలో వసూలు చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీలదే. ఆయా పన్నులను సకాలంలో బకాయిలు లేకుండా వసూలు చేసి అభివృద్ధి పనులకు, సిబ్బంది జీతాలకు వినియోగించుకోవాలి. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పుర పాలకులు పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. పురాల్లో పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తాండవిస్తోందనేందుకు ప్రస్తుతం పేరుకుపోయిన బకాయిలే నిదర్శనం. మార్చి 31వ తేదీ కల్లా అంటే 73 రోజుల్లో రూ.363.25 కోట్లు పన్ను వసూలు చేయాలి. ఈ మేరకు పన్ను వసూలు సాధ్యమేనా అంటే.. (మిగతా 2వ పేజీలో)

సమీక్షిస్తున్నా.. సాచివేత

మార్చి 31వ తేదీ సమీపిస్తున్నా పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు సాచివేత ధోరణి అవలంబిస్తున్నారు. వసూళ్లలో అలసత్వంపై మున్సిపల్ పరిపాలన డైరెక్టర్(డీఎంఏ) ఇటీవల జరిగిన సమీక్షలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా స్పందన కానరావడంలేదు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో పన్నుల వసూలు నామమాత్రంగా కూడా లేదు. ఇక్కడ 28.03 శాతమే వసూలైంది. గుంటూరు కార్పొరేషన్, బాపట్ల మున్సిపాల్టీలలో పన్ను వసూలు 33 శాతంలోపే ఉంది.

వసూలు.. 35.04%

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆస్తి, నీటి పన్నులను మార్చి 31వ తేదీకి రూ.559.24కోట్లు వసూలు చేయాలి. శుక్రవారానికి రూ.195.99కోట్లు పన్ను వసూలు కాగా అది 35.04 శాతంగా ఉంది. ఆస్తిపన్ను రూ.465.95 కోట్లకు ఇప్పటివరకు రూ.177.08కోట్లు వసూలు చేశారు. వసూలుశాతం 38గా నమోదైంది. నీటిపన్ను వసూలు నామమాత్రంగా కూడా లేదు. రూ.93.29 కోట్లకు రూ.18.91కోట్లు మాత్రమే వసూలైంది. పన్ను వసూలు 20.27 శాతంగా ఉంది. పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ స్థానంలో ఉంది.

రూ.కోట్లలో ప్రభుత్వ బకాయిలు..

మున్సిపాల్టీలకు పన్నుల బకాయిలు పెద్దగుదిబండగా మారుతున్నాయి. ఈ బకాయిల్లో ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలవే అధికంగా ఉంటున్నాయి. కొన్ని సంస్థలు, విభాగాలు అయితే ఏళ్లుగా పన్నులు చెల్లించడంలో తాత్సారం చేస్తు న్నాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధి లోని ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన పన్ను బకాయిలు రూ.20.85 కోట్లు ఉన్నాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.5.47కోట్లు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయినా బకాయిల చెల్లింపుల్లో తీవ్రజాప్యం జరు గుతున్నది.



మూడు జిల్లాల్లో అత్యల్పంగా పన్ను వసూలుచేసిన చిలకలూరిపేట మున్సిపాలిటీ

చెల్లింపులపై.. కసరత్తు

- పది రోజుల్లో రూ.33.77 కోట్లు మంజూరు
- ఐదేళ్ల క్రితం బకాయిలపై ప్రభుత్వం దృష్టి
- బిల్లులను అప్‌లోడ్ చేసిన డ్వామా అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఉపాధి హామీ బిల్లుల చెల్లింపులు జరగలేదు. వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసిన పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. 2019 మార్చికి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం కింద గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పెద్దసంఖ్యలో ప్రగతి పనులు జరిగాయి. అయితే ఆయా బిల్లులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బిల్లులను చెల్లించాలని అధికారులకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2019 మార్చికి ముందు పనులకు బిల్లుల చెల్లింపులను పది రోజుల్లో మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల డ్వామా అధికారులు పెండింగ్ బిల్లుల నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. రానున్న పది రోజుల్లో బిల్లుల చెల్లించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి రూ.33.77 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించనున్నది. ఈ క్రమంలో రూ.లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసి బిల్లుల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్న వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పెద్దఎత్తున ఉపాధి పనులు

ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలను 2019కి ముందు నిర్మించారు. పాడి రైతులు మినీ గోకులాలను కూడా ఉపాధి హామీ పథకంలో పెద్దసంఖ్యలో నిర్మించుకున్నారు. వీటికి సంబంధించిన బిల్లులు బకాయిలు పేరుకుపోయాయి. అయినా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. పనులు చేసిన వారు బిల్లులు చెల్లించాలని కోర్టుకు కూడా వెళ్లారు. కోర్టు ఆదేశాలు జారీ చేసినా బిల్లులు చెల్లింపులు జరగలేదు. బిల్లులు నిలిచిపోవడంతో వందలాది మంది ఆర్థికంగా నష్టపోయారు. ఆయా బిల్లులను వడ్డీతో కలిపి చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఆ హామీని ప్రస్తుతం అమలు చేసేందుకు సిద్ధమైంది. పనులు చేసిన బాధిత వ్యక్తులకు ప్రభుత్వ ప్రకటన ఊరటనిచ్చింది. సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు, మినీ గోకులాలు తదితర పనులకు సంబంధించి ఇంజనీర్లు రికార్డులు నమోదు చేశారు. ఆయా ఇంజనీర్లు పనుల జాబితాలను జిల్లాల వారీగా డ్వామా పీడీలకు అందజేశారు. ఈ మేరకు పీడీలు బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు సదరు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా రూ.26.65 కోట్లు బకాయిలు చెల్లించాలి. గుంటూరు జిల్లాలో రూ.87 లక్షలు, బాపట్ల జిల్లాలో రూ.6.22 కోట్లు విలువైన బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



సీసీ రహదారి

రోగులేరీ?

- యూపీహెచ్‌సీల్లో సేవలు నామమాత్రం
- ఆరోగ్య కేంద్రాల వైపు కన్నెత్తి చూడని రోగులు
- అన్ని సేవలకు జీజీహెచ్ వైపే బాధితుల చూపు

గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సుందరమైన భవనాలు.. అర్హత కలిగిన వైద్యులు.. సిబ్బందితో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే రోగులు మాత్రం ఆ వైపునకు తొంగి చూడటం లేదు. మెజారిటీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూపీహెచ్‌సీ) ఓపీ దారుణంగా ఉంది. గుంటూరు నగర పరిధిలోని నల్లచెరువు, లాలాపేట ఆరోగ్య కేంద్రాలు మినహా మిగిలిన అన్ని చోట్లా రోజుకు కేవలం 15 నుంచి 25 మంది మాత్రమే రోగులు వస్తున్నారు. ఈ మధ్య కాలంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. అయితే అవి ఇంకా అమలుకు నోచుకోక పోవడం గమనార్హం.

నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో గుంటూరు జిల్లాలో 47 ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో వైద్యులతో పాటు, స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది ఉంటారు. ఈ ఆరోగ్య కేంద్రాల్లో మురికివాడలు, సమీప కాలనీల్లోని ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలన్నది ముఖ్య ఉద్దేశం. అయితే ప్రభుత్వ ఉద్దేశం ఘనంగా ఉన్న వైద్య, ఆరోగ్య శాఖ నిర్లిప్తత సామాన్యులకు శాపంగా పరిణమిస్తోంది. ఇంటి పక్కనే అర్హత కలిగిన వైద్యులు.. ఆధునికంగా వైద్యశాల ఉన్నా సామాన్యులు అటువైపు చూడడం లేదు. చిన్నా, చితక రోగాల కోసం కూడా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి లేదా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులను ఆకర్షించడంలో విఫలం కావడంతో ఆ భారం జీజీహెచ్‌పై పడుతుంది. జీజీహెచ్‌లో తెల్లారేసరికి వేలాది మంది రోగులు ఓపీ కోసం ఎదురు చూస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఐసీఎమ్ఆర్ (మిగతా 2వ పేజీలో)



రోగులు లేక వెలవెలబోతున్న తుఫాన్‌నగర్ పీహెచ్‌సీ

బృందావన్‌గార్డెన్స్‌లోని పీహెచ్‌సీ

కృష్ణానదికి మరో రక్షణ గోడ

- సీతానగరం వైపు త్వరలో నిర్మాణం
- రూ.294.20 కోట్లతో అంచనాలు సిద్ధం
- రైల్వే బ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిమీటర్లు
- జలవనరుల శాఖ ప్రతిపాదనకు మంత్రివర్గ ఆమోదం

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది వరద ముంపును అరికట్టడానికి విజయవాడ వైపున రక్షణ గోడ నిర్మించినట్లుగానే గుంటూరు జిల్లాలోని సీతానగరం, తాడేపల్లి వైపు కూడా రెండో రక్షణ గోడను నిర్మించనున్నారు. గత ఏడాది సెప్టెంబరు 1న సుమారు 11 లక్షల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజీని తాకింది. అయితే, విజయవాడ వైపు ఉన్న ప్రాంతాలపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. కానీ, సీతానగరం ఘాట్లపై నుంచి సిమెంట్ రహదారిపైకి నీరు చేరింది. ఈ నేపథ్యంలో సీతానగరంలోని రైల్వేబ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిలోమీటర్ల మేర గోడను నిర్మించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదించారు. దీనికి రూ.294.20 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. తాడేపల్లి పరిధిలో బ్యారేజీకి దిగువన నదికి కుడి మార్జిన్లో 0.9 కి.మీ నుంచి 2.61 కి.మీ వరకు వరద రక్షణ గోడ(రిటైనింగ్ వాల్) పనులకు పరిపాలన అనుమతికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీంతో రెండో రక్షణ గోడ నిర్మాణానికి కొద్దినెలల్లో అడుగులు పడతాయని జలవనరులశాఖ వర్గాలు తెలిపాయి.

వరద నుంచి రక్షణ

ప్రతీ ఏటా వర్షాకాలంలో కృష్ణా నది వరద ఉధృతి కారణంగా తాడేపల్లి పరిధిలోని సుందరయ్యనగర్, మహానాడుకాలనీ తదితర ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వరద సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది. విజయవాడ వద్ద నది ఎడమవైపు మార్జిన్‌లో రక్షణ గోడను నిర్మించడం వల్ల వరద వచ్చినా కృష్ణలంక, రాణీగారితోట తదితర పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడలేదు. వారికి రక్షణ లభించింది. అదే తరహాలో నదికి కుడివైపు మార్జిన్‌లో బ్యారేజ్‌కు దిగువన కూడా శాశ్వత ప్రాతిపదికన రక్షణ గోడను నిర్మించాలని పల్లపు ప్రాంతాల ప్రజలు కోరారు. వారి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న మంత్రి మండలి రక్షణ గోడ నిర్మాణానికి ఆమోదం తెలిపింది.



కనకదుర్గమ్మ వారధి వద్ద విజయవాడ వైపు నిర్మించిన రక్షణ గోడ

తొలగించినా.. బరితెగింపు



కోనూరు కృష్ణానదిలో నదికి అడ్డంగా నిర్మించిన రోడ్డుపై లారీలకు ఇసుక లోడింగ్

- నదిలో మళ్లీ రోడ్డేసిన ఇసుకాసురులు
- అధికారులపై అక్రమార్కుల బెదిరింపులు
- మోటార్లకు నీరందడంలేదని రైతుల గగ్గోలు
- కృష్ణమ్మను కుళ్లబొడుస్తోన్న తెలుగు తమ్ముళ్లు
- నాడు వైసీపీ.. నేడు టీడీపీ అక్రమ తవ్వకాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇసుక జోలికి వెళ్ల వద్దు.. ఉచిత ఇసుకలో ప్రభుత్వానికి అపకీర్తి తేవొద్దు.. సామాన్యులకు సులభంగా ఇసుక అందాలి.. అని పదే పదే ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిస్తున్నారు. అయినా తెలుగు తము ళ్లు లక్ష్య పెట్టడంలేదు. గత నెలలో ఏకంగా కృష్ణానదిలోనే ప్రవా హానికి అడ్డుగా రోడ్డు వేసి మరీ ఇసుకను తవ్వి తరలించారు. ఆ సమయంలో నదిలోనే రోడ్డేశారు.. అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా అచ్చంపేట తహసీల్దారు తొలగించారు. అయితే ఏమాత్రం వెనక్కి తగ్గని ఇసుకాసురులు బరితెగించారు. మళ్లీ అక్కడే రోడ్డు నిర్మించుకుని నది మధ్యలోకి వెళ్లి కృష్ణమ్మను కుళ్లబొడిచి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. పార్టీ అధినేత, ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాలను, మీడియాలో కథనాలను, అధి కారుల చర్యలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వి తరలిస్తూ తెలుగు తమ్ముళ్లు జేబులు నింపుకుంటున్నారు. అధికారం మాది అడిగేదెవరు.. ఆపేదెవరు అన్న రీతిలో రెచ్చిపోతున్నారు. గత వైసీపీ హయాంలో ఇసుకను దోచుకుం టున్నారని విమర్శంచగా.. నేడు వారిని తలదన్నే రీతిలో కొందరు కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. కృష్ణాన దిలో లెక్కకు అందనంతగా ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇసుక దోపిడీ కోసం ఏకంగా నదిలోనే అడ్డంగా రోడ్డు నిర్మించుకుని నిరాటంకంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేసే వారు కూడా లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమార్కులపై చర్యలు తీసుకునే సాహసం అధికారులు చేయడంలేదు. నదీ గర్భాన్ని చీల్చుతూ అక్రమంగా రోడ్డు నిర్మించినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రశ్నించే సాహసం చేయని అధికారులు

చట్టాలు.. నిబంధనలకు తూట్లు పొడిచి అచ్చంపేట మండలంలోని కోనూరు వద్ద దాదాపు కిలోమీటరన్నర పొడవునా నదీ ప్రవాహానికి అడ్డంగా రోడ్డు వేశారు. నదిలో అడ్డుగా రోడ్డులా కట్ట వేయడంతో ప్రవాహం తగ్గి దిగువన వ్యవసాయ మోటార్లకు సరిగా నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా రివర్ కార్యాలయం నుంచి కాని, ఏ అధికారి నుంచి గాని రోడ్డు వేసేందుకు అనుమతులు లేవు. కోనూరు రేవు నుంచి రోడ్డు నిర్మించి నది మధ్యలో ఉన్న ఇసుకను దోచేస్తున్నారు. అదేమని ప్రశ్నించే సాహసం కూడా అధికారులు చేయడంలేదు. రోడ్డు నిర్మాణం విషయంలో వారు గుడ్లప్పగించి చూస్తున్నారే కానీ అడ్డుకోలేదు. చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తే వారిపై ప్రజాప్రతినిధుల ద్వారా కొందరు అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అక్రమంగా రీచ్‌లను ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ చేస్తున్నారు. నాడు ఇసుకాసురుడు నంబూరు శంకరరావు అని విమర్శించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తన నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



కోనూరు వద్ద కృష్ణానదిలో అక్రమంగా ఇసుక లోడుతో వెళుతున్న లారీలు

నేడు నంబూరుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్ శనివారం పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి రానున్నారు. శనివారం చేపట్టిన ' స్వచ్ఛ్ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా ఆయన నంబూరు వస్తున్నారు. తొలుత నంబూరు గ్రామానికి చెందిన సంపద సృష్టి కేంద్రం (డంపింగ్ యార్డ్)ను పరిశీలిస్తారు. అనంతరం నంబూరు పాఠశాలలో జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు.

21 నుంచి యూజీ డిగ్రీ వన్ టైం ఆపర్చునిటీ పరీక్షలు

పెదకాకాని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో యూజీ డిగ్రీ ఇయర్ ఎండ్ కోర్సులకు సంబంధించి వన్ టైం ఆపర్చునిటీ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద రావు శుక్రవారం తెలిపారు. బీఏ, బీకాం(జనరల్), బీకాం (రీస్ట్రక్చర్), బీకాం (ఒకేషనల్), బీబీఎం, బీసీఏ, బీఎస్సీ, బీఏవోఎల్ పరీక్షల షెడ్యూలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు గుంటూరులోని ఏసీ కళాశాల, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా కళాశాలల విద్యార్థులు ఒంగోలులోని రాఘవ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ప్రాక్టికల్, ఇంటర్నల్స్, వైవా, ప్రాజెక్ట్ వంటి పరీక్షలు ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గుంటూరులోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణ, ఉమ్మడి ప్రకాశం జిల్లాల అభ్యర్థులు హాజరు కావాలని ఆయన సూచించారు.

ఉల్లాస భరితంగా ప్రీమియర్ లీగ్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. ఆరో రోజైన శుక్రవారం నెల్లూరు, తూర్పు గోదావరి జట్లు విజయం సాధించాయి. ప్రకాశం జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 155 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 14.1 ఓవర్లలో 90 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. సాలుంకి అఖిల్ 4 ఓవర్లలో 12 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. చిత్తూరుతో జరిగిన మ్యాచ్‌లో తూర్పు గోదావరి జిల్లా జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 19.5 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆలౌటయింది. టీవీ సాయిశ్రావణ్ 46 బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. ఈ పోటీలకు సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ సంస్థలు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

దాచేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురజాల గ్రామానికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు (40) దాచేపల్లిలో లారీ క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ రాత్రి జీతం డబ్బులు తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంపై గురజాల నుంచి దాచేపల్లికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మిరియాల వెళ్తుండగా మార్గమధ్యలోని నడికుడి ఓవర్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. ఈ సంఘటనలో గాయపడిన వెంకటేశ్వర్లు గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య మరియమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జిల్లాలో ఇద్దరు డీఎస్పీలపై వేటు

- శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు తొలి పోస్టింగ్స్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు డీఎస్పీలపై వేటు పడింది. వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్, సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావులపై వేటు వేశారు. సుమారు నాలుగు నెలల క్రితమే వీరు డీఎస్పీలుగా నియమితులయ్యారు. అయితే వివిధ ఆరోపణ నేపథ్యంలో వారిని వీఆర్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు పోస్టింగ్స్ ఇచ్చారు. వెస్ట్ డీఎస్పీగా కె.అరవింద్‌ను, సౌత్ డీఎస్పీగా జి.భానోదయను నియమించారు. అలాగే గురజాల డీఎస్పీగా గత నెలలోనే అటాచ్మెంట్‌పై నియమితులైన బీఎల్ నాగ జగదీష్‌ను తిరిగి గురజాలకే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలకు పోస్టింగ్ ఇచ్చారు.

బోరుగడ్డకు రాచమర్యాదలు ఆరోపణల నేపథ్యంలో..

వెస్ట్ డీఎస్పీగా కొద్ది నెలల క్రితం నియమితులైన జయరాం ప్రసాద్‌పై బదిలీ వేటు పడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన గురజాల డీఎస్పీగా విధులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను వెస్ట్ డీఎస్పీగా నియమించారు. అయితే రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు పోలీస్ కస్టడీలో రాచమర్యాదల విషయంలో అరండల్‌పేట సీఐ కె. శ్రీనివాసరావును వీఆర్‌కు బదిలీ చేయగా, మరో ముగ్గురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. కాగ ఈ వ్యవహారంలో వెస్ట్ డీఎస్పీగా ఉన్న జయరాం ప్రసాద్ సరైన పర్యవేక్షణ చేయలేదనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. దాని ఆధారంగా డీఎస్పీ జయరాం ప్రసాద్‌పై బదిలీ వేటు పడింది అయితే ఆయనకు ఇంకా పోస్టింగ్ లభించలేదు. అదేవిధంగా సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావుపై కూడా బదిలీ వేటు వేశారు. ఆయన బదిలీ కూడా పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఆయనకు సబ్ డివిజన్‌లోని ఓ సీఐకు మధ్య పొసగడం లేదని తెలుస్తోంది. ఆయన బదిలీకి ఇది కారణమై ఉంటుందని పలువురు అంటున్నారు. గతంలో ఆయనపై ఏసీబీ కేసు ఉండడంతో దానిని కూడా సాకుగా చూపించి ఉంటారని అంటున్నారు.

ఆగని ఆగడాలు!

- జిల్లాలో హిమాలయ అగ్రిటెక్ నకిలీ బయో ఉత్పత్తుల విక్రయాలు
- వినుకొండ నుంచి వచ్చి శివారు గ్రామాల్లో పాగా
- చలించని అధికార యంత్రాంగం

గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు కూత వేటు దూరంలో నకిలీ బయో ఉత్పత్తులు అమ్ముతున్నా, అధికార యంత్రాంగంలో చలనం కనిపించడం లేదు. వినుకొండ ప్రాంతానికి చెందిన హిమాలయ అగ్రిటెక్ కంపెనీ ఏ విధమైన అనుమతి లేకుండా గత కొద్ది రోజులుగా గుంటూరు పరిసర గ్రామాల్లో నకిలీ మందులు విక్రయిస్తుంది. జీ-2 అనుమతి లేకుండా ఈ కంపెనీ బయో ఉత్పత్తులు విక్రయిస్తుందని వినుకొండ పోలీసులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో రూ. 80 లక్షల విలువ చేసే నకిలీ బయోలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సదరు కంపెనీకి చెందిన వ్యక్తులు తమ ఉత్పత్తులను తీసుకువచ్చి రూరల్ మండలంలోని పొత్తూరు, ఓబుల్ నాయుడుపాలెం, యనమదల, నాయుడుపేట, చౌడవరం తదితర గ్రామాల్లో విక్రయాలు ప్రారంభించారు. ప్రతి రోజూ వందలాది మంది రైతులు ఈ నకిలీ మందులు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఈ నకిలీ మందుల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వినుకొండకు చెందిన హిమాలయ అగ్రిటెక్ పై తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి కూడా ఫిర్యాదులు అందాయి.

గ్రామాలు మార్చుతూ వ్యాపారం

వినుకొండకు చెందిన వ్యక్తి చుట్టూ కిరాయి మూకలను ఏర్పాటు చేసుకొని మరీ ఈ నకిలీ బయోఉత్పత్తుల విక్రయాలను జరుపుతున్నట్టు తెలిసింది. అనుమానం వస్తే మకాం వెంటనే వేరే గ్రామానికి మార్చుతూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. కంపెనీకి చెందిన వ్యక్తికి ఫోన్ చేస్తే వాళ్లే వచ్చి రైతులను మందులు ఉన్న గోడౌన్ దగ్గరకు తీసుకెళ్లి విక్రయాలు చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ సహకరిస్తుందా..

గతేడాది డిసెంబరు 18న ఒక రైతు రూ.3,860 విలువ చేసే పురుగు మందులను వీరివద్ద కొనుగోలు చేశారు. ఇంటికి వచ్చిన తర్వాత అవి నకిలీ మందులని తేలింది. బాధితుడు వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లినట్లు సమాచారం. అయితే వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతోనే ఈ అమ్మకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేర్వేరు కేసుల్లో బంగారం చోరీ


బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు

రేపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 25 సవర్ల బంగారం చోరీ రేపల్లెలో జరిగింది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన అల్లపర్తి లావణ్య ఈ నెల 2న పుట్టింటికి వెళ్లారు. ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని ఈ క్రమంలో దొంగలు బుధవారం తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 25 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు విషయాన్ని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనంతవరప్పాడులో..

వట్టిచెరుకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో ప్రధాన రహదారి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఒక గృహంలో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడి విలువైన ఆభరణాలు, నగదు అపహరించుకుపోయిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచారం మేరకు అనంతవరప్పాడు గ్రామంలోని కడియాల హనుమంతరావుకు చెందిన డాబాలో కూలి పనుల నిమిత్తం ఏలూరు జిల్లా శ్రీపర్రు గ్రామానికి చెందిన మందల ఆనందరాజు కుటుంబం మూడేళ్లుగా నివశిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈ నెల 12న సంక్రాంతి పండగకు స్వగ్రామం ఆపర్రు వెళ్లారు. గురువారం అనంతవరప్పాడు గ్రామం చేరుకున్నారు. కాగా ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించి గృహ యజమాని హనుమంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రమా నాయక్, హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు గృహానికి చేరుకొని వివరాలు సేకరించారు. 20 గ్రాముల బంగారు తాళిబొట్టు, మంగళసూత్రం, చెవి దిద్దులు, మూడు గ్రాముల ఉంగరం, వెండి పట్టీలు, రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రధాన రహదారి కావటం, కొత్త వారు సంచరిస్తున్నట్టు సమాచారం ఉందనీ, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు పంచాయతీ, దాతలు సహకరిస్తే నేరాలు అరికట్టవచ్చని తెలిపారు.

73 రోజులు.. రూ.363.25 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాల్ అధికారుల తీరు పరిశీలిస్తే కష్టమనిపిస్తోంది. చిలకలూరిపేట, గుంటూరు కార్పొరేషన్, బాపట్ల మున్సిపాల్టీలలో పన్ను వసూళ్లు దారుణంగా ఉంది. మంగళగిరి-తాడేపల్లి, పిడుగురాళ్ల, అద్దంకి మున్సిపాల్టీల్లో మాత్రం పన్ను వసూలు మెరుగ్గా ఉంది. ఆదాయ వనరులను పెంచుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనేందుకు పన్నుల వసూళ్లే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నా అధికారుల్లో స్పందన లేదు. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నులు పక్కదారి పడుతున్నాయి.

జీతాల చెల్లింపుల్లో జాప్యం..

పన్నుల వసూళ్లు, ఆదాయ వనరులు అంతంత మాత్రంగా ఉండటంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వాహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్లు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేస్తున్నారు.

మద్యం మత్తులో చెలరేగిన వివాదం

- కత్తిపోట్లతో ఒకరి పరిస్థితి విషమం


గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సుబ్రహ్మణ్యం

వేమూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్నేహితుల మధ్య వివాదం చెలరేగింది. చివరికి కత్తిపోట్లకు దారి తీసింది. ఈ సంఘటన వేమూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేమూరు గ్రామ పరిధిలోని ధర్మాపురానికి చెందిన పోతార్లంక సుబ్రహ్మణ్యం (బుల్లబ్బాయి), అతని మిత్రుడు అద్దేపల్లి జాన్‌వెస్లీ కలిసి మద్యం తాగుతూ మత్తులో గొడవ పడ్డారు. వివాదం పెద్దది కావడంతో జాన్‌వెస్లీపై కత్తితో దాడి చేశాడు. అదే సమయంలో సమీపంలో మద్యం తాగుతున్న జాన్‌వెస్లీ సోదరుడు అద్దేపల్లి ప్రవచన్, బోరుగడ్డ డేవిడ్‌లు వెస్లీపై కత్తితో దాడి చేస్తావా అంటూ బుల్లబ్బాయిని సమీపంలో ఉన్న రాళ్లతో తీవ్రంగా గాయపరిచారు. చెవి పైభాగంలో మెదడు వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రాణపాయ స్థితిలోకి వెళ్లడంతో సమాచారం తెలుసుకున్న బంధువులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కత్తిపోట్లకు గురైన జాన్‌వెస్లీని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై వేమూరు ఎస్ఐ రవికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ విజేత ఇండియన్ నేవీ జట్టు


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా రైతుమిత్ర కమిటీ వారు నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ విజేతగా ఇండియన్ నేవీ జట్టు నిలిచింది. రన్నరప్‌గా తమిళనాడు జట్టు బహుమతి గెలుచుకుంది. టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి 50 జట్లు పాల్గొనగా, 12 జట్లు లీగ్‌లోకి వచ్చాయి. వాటిలో మూడో బహుమతి ఏపీ స్కై(టాస్), నాలుగో బహుమతి కర్ణాటక బీఎమ్ఎస్, ఐదో బహుమతి ఏపీ స్కై-2, ఆరో బహుమతి పంజాబ్ జట్టు, ఏడో బహుమతి ఝార్ఖండ్ జట్టు, ఎనిమిదో బహుమతి ఎస్‌వీఎస్ ముప్పాళ్ళ, పదో బహుమతి జీవీ యూత్ జట్టు,పదకొండో బహుమతి సత్తెనపల్లి, పన్నెండో బహుమతి రావిపాడు జట్లు గెలుచుకున్నాయి. బెస్ట్ రైడర్‌గా రోహిత్ తోమార్(ఇండియన్ నేవీ), బెస్ట్ డిఫెండర్‌గా కమల్ (పంజాబ్), మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ మోహిత్ నందాల్ (ఇండియన్ నేవీ జట్టు కెప్టెన్) బహుమతులు అందుకున్నారు. విజేతలకు జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 2 లక్షలు, తృతీయ బహుమతి రూ.1 లక్ష, నాలుగో బహుమతి రూ.70 వేలు, ఐదో బహుమతి రూ. 50 వేలు అందజేశారు.

గుళ్లపల్లిలో ఘోర అగ్నిప్రమాదం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు, గడ్డివామి

చెరుకుపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని ఈఎస్ఆర్ రైస్‌మిల్లు వెనుక ఘోర అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం 7.30 సమయంలో అల్లపర్తి పుల్లారెడ్డి తండ్రి వెంకటేశ్వర్లు పూరిల్లు విద్యుత్‌షార్టు సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఒక దూడ మృతి చెందింది. రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక గడ్డివామి దగ్ధమైంది. ఇంటిలో గృహోపకరణాలు, రూ.12 వేల నగదు, ఒక ఉంగరం కాలిపోయాయని బాధితుడు తెలిపారు. సుమారు రూ. 5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తుంది. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయమై వీఆర్వో రమేష్‌ను సంప్రదించగా నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

చేతికొచ్చిన కంది పంట బూడిదపాలు

- రూ. 2 లక్షల నష్టం


బూడిదగా మారిన కంది పంట

దాచేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీరాన ఉన్న భట్రుపాలెం గ్రామంలో కందిపంటను కోసి కుప్పవేసి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు అంటించిన నిప్పుతో పంట కాస్త కాలి బూడిదగా మారింది. శుక్రవారం దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామంలో కేశావత్ సైదానాయక్, భూక్యా రమణనాయక్ 3 ఎకరాలలో కందిపంట కోశారు. పంట పొలంలో ఉన్న కందిపంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో చేతికొచ్చిన పంట కాస్త అగ్నికి ఆహుతైంది. పంట నష్టం రూ. 2 లక్షలు ఉంటుందని రైతులు సైదానాయక్, రమణానాయక్ కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటన తోటి రైతుల్లో భయాందోళన, ఆగ్రహాన్ని కలిగించాయి.

నివేదిక ఆధారంగా ఎస్సైపై చర్యలు

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో ఎస్ఐ రాజ్‌కుమార్, న్యాయవాది బేతాళం ప్రకాశరావు మధ్య చోటు చేసుకున్న ఘటనలపై న్యాయ విచారణకు ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం చెప్పారు. ఈ ఘటనపై విచారణకు మరో డీఎస్పీని నియమించినట్లు తెలిపారు. విచారణ నివేదిక వచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనకు సంబంధించి ఎస్ఐ రాజ్‌కుమార్‌ను అదే రోజు వీఆర్ కు పిలిపించి, ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి డీఎస్పీని నియమించినట్లు తెలిపారు. ఎస్సై, న్యాయవాది మధ్య జరిగిన సంఘటనకు సంబంధించి నమోదైన కేసుల దర్యాప్తు నిమిత్తం ప్రస్తుతం మరొక డీఎస్పీని నియమించినట్లు తెలిపారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా ఎస్సై రాజ్‌కుమార్‌పై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయవాద మిత్రులు విషయాలను అర్థం చేసుకొని పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

తాడికొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన షేక్ షన్ను(22), ముక్కామల గ్రామానికి చెందిన రావెల యశోధరావు గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే పుట్టింటికి వెళ్లి వస్తానని భర్తను పలుమార్లు అడిగినా పంపించేవాడు కాదు. దీంతో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి బంధువులకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ముక్కామల చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. మృతురాలి తల్లి షేక్ వహిద తన కుమార్తె మృతి అనుమానాస్పదంగా ఉందని గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జిత్యా నాయక్ తెలిపారు.

రోగులేరీ?

(మొదటి పేజీ తరువాయి)

(భారత వైద్య పరిశోధనా మండలి) లెక్కల ప్రకారం లక్ష జనాభా లో ఏడాదికి 10 వేల నుంచి 15 వేల ఔట్ పేషంట్లు, 5 వేల నుంచి 7 వేల వరకు ఇన్ పేషంట్లు ఉండాలి. 2023 జనాభా లెక్కల ప్రకారం గుంటూరు నగర జనాభా సుమారు 9.80 లక్షలు. ఈ లెక్కన ప్రతిరోజూ ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండాలి. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మాత్రం ఆ పరిస్థితి కానరావడం లేదు.

రోగానికి వైద్యానికి సంబంధం లేదు..

గుంటూరు గుజ్జనగుండ్లలోని ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం ఉదయం ఓ మహిళ చెవి, తలలో నొప్పి అని వచ్చారు. గతంలో బీపీ, షుగర్ ఉన్నట్లు మహిళ చెబుతున్నారు. డాక్టర్ మాత్రం ఆమెకు మందులు రాసి చీటీ చేతిలో పెట్టారు. ఏమి మందులు రాశారని సదరు మహిళ అడిగితే బలానికి(బీ-కాంప్లెక్స్), తల తిరుగుడు ఆగడానికి రాసినట్లు వైద్యురాలు చెప్పారు. బీపీకి, షుగర్‌కి మందులు ఎందుకు రాయలేదంటే ప్రస్తుతం అవి పూర్తి కంట్రోల్‌లో ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. అసలు మందులు వాడకపోతే రేపు మళ్ళీ బీపీ, షుగర్ లెవల్స్ పెరిగే అవకాశం ఉన్నా అవేవీ పట్టించుకోకుండా డాక్టర్ బలం మందులతో సరిపెట్టడం గమనార్హం. ఇలాంటి కారణాలు వల్లే చాలామంది పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేందుకు ఇష్టపడని పరిస్థితి కనిపిస్తోన్నట్లు సమాచారం. ఏ రోగమైనా అదే పారాసిటమాల్, డైక్లోఫెనాక్, మెట్రోజెల్, సిట్రజిన్, బీకాంప్లెక్స్ మాత్రలు మాత్రమే ఇస్తున్నారు. వీటికి మించి మరేమీ ఇవ్వకపోవడంతో ఆ మందులకు రోగం తగ్గదన్న భావన ప్రబలుతున్నట్లు కనిపిస్తుంది. పైగా చిన్న చిన్న రోగాలకు ఇక్కడ వైద్యం అందుతుందన్న ప్రచారం కూడా మురికివాడలు, కాలనీల్లో సరిగా జరగక పోవడం వల్ల ఓపీ పెరగడం లేదని సమాచారం.

ఈ హెచ్ఆర్‌తో పోలిస్తే ఓపీ దారుణం..

ఈహెచ్ఆర్ పేరుతో(ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు) రోజు వారీ వచ్చే ఓపీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ రికార్డుతో పోలిస్తే ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది చేతితో రాసి నిర్వహిస్తున్న ఓపీ రిజిస్టర్‌లోని సంఖ్య చాలా తేడా ఉంటుంది. సాధారణ ఓపీ రిజిస్టర్ లో క్షేత్రస్థాయి ఏఎన్ఎంలతో కొన్ని పేర్లు నమోదు చేయించి ఎక్కువ మంది వచ్చినట్లు చూపించే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తుంది.

పరారీలో ఎరువుల వ్యాపారి?

మాచర్లటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన ఓ ఎరువుల వ్యాపారి పరారైనట్లు సమాచారం. బంధువులు, స్నేహితుల వద్ద నుంచి సుమారు రూ. 1.50 కోట్ల దాకా అప్పులు చేసినట్లు తెలిసింది. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి సమీపంలో వ్యాపారం చేసే ఈ వ్యక్తి పెద్ద మొత్తంలో అప్పులు చేయడంతోపాటు చీటిపాటలు పాడి ఆ డబ్బుతో వారం రోజులుగా ముఖం చాటేశాడు. సుదీర్ఘకాలంగా పట్టణంలో నివసించడం, ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో పెద్ద మొత్తంలో ఇతరుల వద్ద నుంచి అప్పులు పొందినట్లు తెలుస్తోంది. దీంతో అప్పులిచ్చిన వారు లబోదిబోమంటున్నారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 561.80 అడుగులు ఉంది. ఇది 236.61 టీఎంసీలకు సమానం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138,147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

ఎన్‌సీసీ క్యాడెట్ బృందంలో బాపట్ల ఫార్మశీ కళాశాల విద్యార్థి


ఎస్.శ్రీకాంత్

బాపట్లరూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : యూత్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్ 20024-2025లో భాగంగా నేపాల్‌లో జరిగే వేడుకలలో ఎన్‌సీసీ బృందానికి బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ విద్యార్థి ఎస్.శ్రీకాంత్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. జాతీయ స్థాయి బృందానికి ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లు నేపాల్ ఆర్మీడే, మహాశివరాత్రి వేడుకలలో పాల్గొంటారని చెప్పారు. తమ ఎన్‌సీసీ విద్యార్థి జాతీయ స్థాయి బృందంలో ఎంపికవ్వటం ఎంతో గర్వకారణమని కళాశాల ఏఎన్‌వో సీహెచ్ సుష్మా తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థి ఎస్.శ్రీకాంత్‌ను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎడ్యుకేషన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం

కొల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ, కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యుడు నక్కా ఆనందబాబు పాల్గొంటారని చెప్పారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద, మండల పరిధిలోని దోనేపూడిలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండి అప్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షుడు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటిలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు అభిమానులు పాల్గొనాలని కోరారు.

నడింపల్లిలో రెవెన్యూ గ్రామసభ

చెరుకుపల్లి,జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లిలో రీసర్వే ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం రెండో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ పద్మావతి మాట్లాడుతూ భూవివాదాలకు సంబంధించి గ్రామస్తులు తమ దగ్గర ఉన్న ధ్రువపత్రాలను అధికారులకు చూపించి ధ్రువీకరించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ శాంతకుమారి, వీఆర్‌వో రమేష్, బాపట్ల తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు గోగినేని వసుధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతినెలా మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్'

చెరుకుపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్' కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలిచ్చినట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్' నిమిత్తం ప్రతినెలా మూడో శనివారం ఒక టీమ్‌ను నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ శనివారం నాడు చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు పూర్తిగా తొలగించాలని, మురుగుకాలువలు శుభ్రపరచాలని, స్వచ్ఛ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బాపట్లలో...

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడోవ వార్డు రాజీవ్‌గాంధీ కాలనీలో శనివారం స్వచ్ఛంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి తెలిపారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు బ్లీచింగ్, దోమలనివారణ, డంప్‌ల తొలిగింపు, మొక్కల పెంపకం, గార్బేజ్ డంప్‌లను శుభ్రం చేయటం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం ఐలాండ్ సెంటర్‌లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పిట్టలవానిపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ.సత్యనారాయణరావు తెలిపారు. ప్రతిగ్రామపంచాయతీలోని సచివాలయ కార్యాలయాలలో సంబంధితాధికారులు ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

చెరుకుపల్లి,జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నపల్లిలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొట్టుకోవడంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అనగానివారిపాలెంకు చెందిన వీరంకి కోటేశ్వరరావు బైకుపై చెరుకుపల్లి వెళ్తుండగా పొన్నపల్లి నుంచి నడింపల్లి వెళ్తున్న బైకు ఢీ కొట్టుకున్నాయి. ఈ ఘటనలో కోటేశ్వరరావు, రెండో బైకుపై ఉన్న పొన్నపల్లికి చెందిన గుర్రం రాజు, గుర్రం అంకమ్మరావు,శెట్టి పోతురాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనపై ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


క్షతగాత్రుడు

గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, హాజరైన అధికారులు

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. 76వ గణతంత్ర దినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ కవాతు మైదానాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలీసు కవాతు నిర్వహించేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ విద్యార్థుల ప్రదర్శన నిర్వహణను పోలీసులు పర్యవేక్షించాలన్నారు. గణతంత్ర వేడుకలు జరిగే మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా స్టాల్స్ సిద్ధం చేయాలని, 11 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధిని చాటిచెప్పే 14 శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. స్వాతంత్ర్యసమరయోధులు, వారి కుటుంబసభ్యులను ఈ వేడుకలకు ఆహ్వానించాలన్నారు. జిల్లా అభివృద్ధిలో విశేష సేవలందించిన ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు అందించాలని, దీనికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ శరవేగంగా చేపట్టాలన్నారు. రాజ్‌భవన్‌లో జరిగే వేడుకలలో పురస్కారాలు అందించటానికి సామాజిక సేవలు, పర్యావరణ పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేస్తున్న వారిని ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అదనపు ఎస్పీ టిపి విఠలేశ్వర్, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా లక్ష్మీనారాయణ


ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లక్ష్మీనారాయణ

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.లక్ష్మీనారాయణను నియమించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను లక్ష్మీనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని లక్ష్మీ నారాయణ తెలిపారు.

ఘనంగా శాంతి కల్యాణం

కర్లపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపులుగువారిపాలెంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో బాపట్ల అఖండ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విన్నకోట సురేష్ పాల్గొన్నారు. విశేష పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌ను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులుగు సాంబశివారెడ్డి, గోపాళం లక్ష్మీనారాయణ, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేనపార్టీ కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, జనసేన సీనియర్ నాయకుడు కారుమూరి అంజనేష్, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


అఖండఫౌండేషన్ వ్యవస్థాపకుడు విన్నకోట సురేష్‌ను సన్మానిస్తున్న సాంబశివరెడ్డి, గ్రామస్తులు

19న గ్రామోత్సవం

తెనాలి అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహిస్తామని సీతారామశర్మ పట్టాభి తెలిపారు. మార్కెట్ సెంటర్‌లోని రామాలయం నుంచి బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు ఈ నెల 19న హిందూ సంఘాల ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. అంగలకుదురు వాసు దాన స్వామి పీఠంలో 20వ తేదీన గ్రామోత్సవం, 22న సీతారాముల కల్యాణం, అన్నదానం జరుగుతాయని తెలిపారు.

కేసులు పెట్టకుండా చూడండి

● చీరాల నియోజకవర్గ ట్రాక్టర్ యూనియన్ నాయకుల విజ్ఞప్తి

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలోని ట్రాక్టర్ యజమానులు, కార్మికులపై కేసులు పెట్టకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈవిషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో తమ సమస్యను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలు పర్చినప్పటికి వ్యాపారం చేస్తున్నారన్న అపోహతో ట్రాక్టర్‌లో ఇసుక తీసుకొస్తే కేసులు నమోదు చేసి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పందిళ్ళపల్లి, వేటపాలెం, అక్కాయవారిపాలెం, కీర్తివారిపాలెం, చల్లారెడ్డిపాలెం, పాపాయపాలెం, ఈపూరుపాలెం, గవినివారిపాలెం, చీరాల పరిసర ప్రాంతాలలో మొత్తం 350 ట్రాక్టర్లు ఫైనాన్స్‌కు తీసుకొని బాడుగకు తిప్పుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఇసుక సరఫరాను అడ్డుకోవడం వల్ల తాము ఉపాధి కోల్పోయి ఫైనాన్స్ కిస్తీలు కట్టలేకపోతున్నామని ఆవేదన చెందారు. తమపై అక్రమ కేసులు పెట్టకుండా ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా చీరాల నియోజకవర్గంలో ఇసుక వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన వారు మరో వర్గానికి చెందినవారి జేసీబీని తగలబెట్టటంతో ఇక్కడ ఇసుకతవ్వకాలు నిలిపివేశారు. దీంతో ఈ సమస్య తలెత్తింది. విజ్ఞప్తి చేసిన వారిలో పులి హరికృష్ణ, పోలకం బుల్లోడు, ఆవుల అశోక్, టి.కోటేశ్వరరావు, పల్లప్రోలు శ్రీనివాసరావు, శేఖర్, రామకృష్ణ, చంటి, మోహన్, నాగరాజు, అయ్యప్ప, శివారెడ్డి, రాఘవులు ఉన్నారు.


కలెక్టరేట్ వద్ద సమస్య వివరిస్తున్న చీరాల నియోజకవర్గ ట్రాక్టర్ యూనియన్ నాయకులు, కార్మికులు

వైభవంగా శ్రీ వేంకటేశ్వర కల్యాణం


శ్రీవేంకటేశ్వర కల్యాణంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైలుపేటలోని సీతారామపురం ఆశ్రమబజారులో శుక్రవారం వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ సావిత్రిగౌరివ్రత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈవేడుకకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. పోలా వెంకటేశ్వర అవధాని, డాక్టర్ కపిలవాయి, రామసోమయాజులు ఆధ్వ ర్యంలో గూడ బాలకృష్ణశాస్త్రి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సావిత్రిగౌరి వ్రతభక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు పోలా పవన్‌కుమార్, బి.బాబునాగేంద్ర, గూడా భట్టు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి


విభిన్న ప్రతిభావంతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించి వారి సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గతంలో వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులను ఆరా తీశారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లా నలుమూలల నుంచి జిల్లా కేంద్రానికి దివ్యాంగులు వచ్చేలా బస్సు సౌకర్యం ఏర్పాటుపై చర్చించారు. దివ్యాంగులు బాపట్లకు వచ్చేలా బస్సు సౌకర్యం ఎందుకు ఏర్పాటు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. అర్జీలు సమర్పించి నెలగడిచినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బస్సు సౌకర్యంపై వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి ఆర్టీసీ అధికారులకు పంపాలని దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే దివ్యాంగులకు కొత్త పింఛన్‌ల మంజూరు ప్రక్రియ చేపడతామన్నారు. మంచం పట్టిన వ్యాధిగ్రస్తులకు రూ.15 వేల పింఛన్ మంజూరు కోసం గుంటూరు జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్ళే బాధ్యత జిల్లా వైద్యశాఖాధికారిపై ఉందన్నారు. అర్జీలు వెంటనే పరిష్కరించాలని లేకుంటే అధికారులపై చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కులగణన అర్జీల స్వీకరణ గడువు ఈనెల 20 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు.

● ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ప్రత్యేక దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నాల్గో శుక్రవారానికి మార్చినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గిరిజన ప్రజల సమస్యల పరిష్కార కార్యక్రమంతోపాటు దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమం కలిపి నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయోత్పత్తులను ప్రోత్సహించాలి : కలెక్టర్

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా పండించిన సేంద్రియ వ్యవసాయోత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను కలెక్టర్ జె.వెంకటమురళి శుక్రవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయోత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియోత్పత్తులను వినియోగించుకోవాలన్నారు. అధికారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఉత్పత్తుల అమ్మకాలు పెరిగితే కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీ విజయనిర్మల, డీపీఎమ్ వాణిశ్రీ పాల్గొన్నారు.

కాల్వల అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టాలి

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖ ద్వారా చేపట్టిన కాల్వల అభివృద్ధి పనులు ఏప్రిల్ చివరి నాటికి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నీటిపారుదల ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటమురళి మాట్లాడుతూ జిల్లాలో నాగార్జునసాగర్ కాల్వలు, కృష్ణా పశ్చిమడెల్టా కాల్వలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి ఏప్రిల్ చివరి నాటికి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, జూన్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరు, పర్చూరు ఛానల్ పనుల ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ఇబ్బంది లేకుండా కాల్వలలో సివిల్స్‌వర్క్స్, పూడికతీత పనులు చేపట్టాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలోని నాగార్జునసాగర్ ఆయకట్టు చివరి భూములకు మార్చి చివరి వరకు సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గుంటూరు ఇరిగేషన్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరత్నం, ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డ్రైనేజిశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.మురళీకృష్ణ, ఇరిగేషన్‌శాఖ అద్దంకి డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగమురళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛత దివస్ నిర్వహించాలి

స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమాలు ప్రతి నెలా మూడోవ శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం సమీక్షించారు. ప్రతినెలా ఒక అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకొని విస్తృతంగా ఈ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. జిల్లా యంత్రాంగం, ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమగ్రప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ప్రతినియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రాలలో ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

● బీసీలు, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కులాలవారు, కాపుల ఆర్థికాభివృద్ధి కోసం రుణసదుపాయం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 20 నుంచి 31 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణసదుపాయం పొందగోరే అభ్యర్థులు గ్రామ, వార్డు సచివాలయాలలో సంప్రదించాలన్నారు.

● ప్రభుత్వ కార్యక్రమాలలో అధికారులు విధిగా ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గవర్నర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం జీవో 520 విడుదల చేసిందన్నారు. ప్రజాప్రతినిధుల హోదాలు, వారి అధికారుల ఆధారంగా ప్రోటోకాల్ విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

● ధాన్యం సేకరణలో బాపట్ల జిల్లా లక్ష్యం మేరకు 50 వేల మెట్రిక్‌టన్నుల సేకరణ జరిగిందని కలెక్టర్ తెలిపారు. అదనంగా మరో 25వేల మెట్రిక్‌టన్నుల సేకరణకు అనుమతివ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు చెప్పారు. వ్యవసాయ కనెక్షన్‌ల మంజూరులో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. 100 రోజుల ప్రణాళిక అమలు, పురోగతిపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. సాగునీటి కాల్వల పనితీరు, పూడికతీతపనులు, రబీసీజన్‌లో నీటివిడుదల, ఎత్తిపోతల పథకాల అమలు తీరుపై సమీక్షించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందిస్తున్న మంత్రిసోదరుడు అనగానిశివప్రసాద్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

రేపల్లె, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు అండగా నిలిచేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ ను అందజేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు రూ.15.26 లక్షలను బాధితులకు అందజేశారు. శివప్రసాద్ మాట్లాడుతూ వైద్యం చేయించుకోలేని పేదలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి చేస్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ పంతాని మురళీధరరావు, రాజబాపయ్య, గోగినేని పట్టాభిరామారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.6 కోట్లతో ట్రాన్స్‌కో అభివృద్ధి పనులు

● ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు దరఖాస్తులు

● ట్రాన్స్‌కో ఏఈ గోపి


ఏఈ కే.గోపి

వేమూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ వేమూరు మండల పరిధిలో మూడు విభాగాలకు సంబంధించి రూ.6 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఏఈ కే గోపి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఐదు వేల జనాభా దాటిన గ్రామంలో త్రీ ఫేస్ నెట్‌వర్క్ ఏర్పాటు నిమిత్తంగా మండలంలోని మేజర్ గ్రామమైన జంపని గ్రామానికి రూ.2 కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధుల ద్వారా గ్రామంలో గతంలో ఉన్న పాత లైన్లను, సింగిల్ ఫేస్ త్రీ వైర్ లైన్లను తొలగించి వాటి స్థానంలో 27 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను, త్రీ ఫేస్ కొత్త లైను ఏర్పాటు చేసి ఫైవ్ వైర్ లైన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 300 కొత్త పోల్స్ ఏర్పాటు చేసి దాదాపు 60 కిలోమీటర్ల మేరకు వైర్ లైన్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకం 'రీ వ్యాంప్ డిస్ట్రిబ్యూటరీ సెక్టార్ స్కీం' ద్వారా కోడిపర్రు ఫీడర్ కింద రూ.2 కోట్ల నిధులతో పనులు చేపట్టామన్నారు. వ్యవసాయ మోటార్ల కనెక్షన్లను విడగొట్టి వాటికి ప్రత్యేక లైను ఏర్పాటు చేయడంతో పాటు బూతుమల్లి, వరహాపురం, బేతాళపురం, బలిజేపల్లి, కొల్లూరు మండలంలోని మొసలిపాడు లలో గృహ వినియోగదారుల కనెక్షన్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తున్నామని, సంబంధించిన ఫీడర్ పరిధిలో లో-వోల్టేజ్ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో 328 మంది రైతులు తమ వ్యవసాయ మోటార్ షెడ్లకు కొత్త సర్వీసు పనులను చేపట్టాలని, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరడంతో ఆయా దరఖాస్తులను పరిశీలించి రూ.2 కోట్ల వ్యయంతో ఆయా పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ వినియోగదారులలో 200 యూనిట్ల లోపు ఉచిత సర్వీసు సేవలను పొందుతున్న వినియోగదారులకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిసున్నట్లు చెప్పారు. మండల పరిధిలో 4,300 మంది ఉచిత సర్వీసుదారులు ఉన్నారని, వారందరికి సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలియజేసిందన్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తే విద్యుత్ చార్జీలు వసూలు చేస్తారన్న ఎలాంటి అపోహలు వద్దన్నారు.

బాపట్ల పట్టణంలో బ్లాక్‌స్పాట్స్ కనిపించకూడదు

● కమిషనర్ రఘునాధరెడ్డి

బాపట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఎక్కడ బ్లాక్‌స్పాట్స్ కనిపించకూడదని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి ఆదేశించారు. స్థానిక శిఖరం వారివీధి పరిసరప్రాంతాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్త, హానికర వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయ పారిశుధ్య విభాగ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్‌లు ఉండేలా చూడాలని, అవసరమైతే ట్రేడ్ లైసెన్స్‌లపై డ్రైవ్ నిర్వహించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్.కరుణ, డి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వార్డులలో సమస్యలు పరిశీలిస్తున్న కమిషనర్

రాష్ట్ర స్థాయి కిక్‌బాల్ పోటీలకు ఐలవరం విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి కిక్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, సర్పంచ్

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కిక్‌బాల్ పోటీలకు ఐలవరం పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం మాచర్ల మోహనరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 11న ఐలవరంలో జరిగిన జిల్లా స్థాయి కిక్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ఐలవరం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 9వతరగతి విద్యార్థులు ఎం.మోహిత్ నాగసాయి మణికంఠ, పి.పవన్‌కుమార్ రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 17, 18 తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలి జడ్పీహెచ్ఎస్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ విద్యార్థులు ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయుడు తమ్మా శ్రీనివాసరెడ్డి, విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలు


అఖండ దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు


భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక అద్దేపల్లి రామనామ క్షేత్రంలో 74వ శ్రీరామ నామస్మరణ కార్యక్రమాలలో భాగంగా రామాయణ గ్రంథంలోని ఘట్టాలను వివరించారు. అఖండ దీపోత్సవంతో కార్యక్రమాన్ని ముగించారు. శ్రీరామనామస్మరణ ఆధ్యాత్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయా కార్యక్రమాలను సంఘ అధ్యక్షుడు కె.భాస్కరరావు పర్యవేక్షించారు.

చేనేత ఎదురీత!



వ్యవసాయం తరువాత అతి పెద్ద ఉపాధి రంగంగా ఉన్న చేనేత పరిస్థితి ఎంతమాత్రం బాగోలేదు. ఒక వైపు పాలకుల నిర్లక్ష్యానికి గురై, మరోవైపు పవర్ లూమ్ దాటికి కుదేలై అవసాన దశకు చేరుతోంది. ఫలితంగా రెక్కాడితేగాని డొక్కాడని నేతన్నల డొక్కలు నెలలు తరబడి ఎండిపోతున్నాయి. దశాబ్దాలుగా వీడని సంక్షోభం వారి జీవితాలను చిదిమేస్తోంది. అయినప్పటికీ చీకటి కమ్ముకున్న తమ జీవితాల్లోకి వెలుగు రేఖ ప్రసరించకపోతోందా.. అన్న ఆశతో వేలాది కుటుంబాలు ఇప్పటికీ చేనేత రంగాన్నే నమ్ముకొని యేటికి ఎదురీదుతున్నాయి. ఈ క్రమంలో అనేక సంక్షోభాలను తట్టుకుని నిలబడ్డ నేతన్న గడిచిన ఐదేళ్లలో కోలుకోలేనంతగా దెబ్బతిన్నాడు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో 50 వేల కుంటుంబాల పరిస్థితి ప్రమాదకర స్థితికి దిగజారింది.

- దీనావస్థలో అతి పెద్ద స్వయం ఉపాధి రంగం
- పనిలేక నేతన్నల ఆకలి కేకలు.. అప్పుల బాధలు
- పవర్‌లూమ్ దెబ్బకు కుదేలైన చేనేత మార్కెట్
- 'పవర్' వస్త్రాలను చేనేతగా విక్రయిస్తున్న ఆప్కో
- ప్రభుత్వ అండ కొరవడడంతో కష్టాల్లో నేతన్నలు
- కూటమి ప్రభుత్వం నుంచీ తప్పని నిరాశ..



నేత కార్మికుడి మగ్గం

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హస్త కళా నైపుణ్యంలో ఎంతో ప్రావీణ్యమున్న చేనేత కార్మికులు ఎన్ని అవాంతరాలు ఎదురైనా కష్ట నష్టాలకోర్చి చేనేత రంగానికి జీవం పోస్తూ వారు జీవిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మరింత దిగజారింది. బాపట్ల జిల్లా చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెంలో సగానికి పైగా మగ్గాలు ఆగిపోయాయి. చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, రాజోలు, గుంటూరు జిల్లా తెనాలి, పొన్నూరు, మంగళగిరి, పల్నాడు జిల్లా గణపవరం, చిలకలూరిపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లో చేనేత పరిశ్రమ మూడో వంతుకు పడిపోయింది. కూటమి ప్రభుత్వం రాకతో తమకు కొంత ఊరట లభిస్తుందని భావించిన నేతన్నలకు గడిచిన ఆరు నెలల కాలం తీవ్ర నిరాశకు గురిచేసింది. కనీసం ప్రభుత్వ పెద్దల ప్రస్తావనకు కూడా చేనేతరంగం నోచుకోకపోవడంతో నేతన్నలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

పవర్‌లూమ్‌తో కోలుకోలేని దెబ్బ..

1985లో నూతన జౌళీ విధానంతో మొదలైన చేనేత పతనం ఇప్పుడు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరింది. పవర్ మగ్గాలు, కాంపోజిట్ మిల్లుల ధాటికి తట్టుకోలేక పోతున్నాయి. ఆధునికీకరణ, యాంత్రీకరణ పేరుతో చేనేతను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకూ అనేక నిర్ణయాలు తీసుకుంటూ వచ్చింది. చేనేత సంరక్షణ కోసమంటూ 22 రకాల వస్త్రాల ఉత్పత్తిని రిజర్వు చేసింది. ఆ తర్వాత వాటిని 11 రకాలకు కుదించింది. పోనీ వాటినైనా సంరక్షించిందా అంటే అదీ లేదు.. దీంతో అవన్నీ పవర్ మగ్గాలు, మిల్లుల్లో ఉత్పత్తి అవుతున్నాయి. మార్కెట్లో చేనేతగా చలామణి అవుతున్నాయి. వాటి కారణంగా చేనేత బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతింది. దీంతో చేనేతకు ఉపాధి అనేదే లేకుండా పోయింది.



పవర్ లూమ్ యంత్రం

ఆప్కోలో నకిలీ ఉత్పత్తులు

చేనేత ఉత్పత్తులకు రక్షణ, ప్రోత్సాహం కల్పించాల్సిన ప్రభుత్వాలే ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించాయి. చేనేత పేరుతో చలామణి అవుతున్న నకిలీ వస్త్రాల ఉత్పత్తికి ఊతమిచ్చేలా సాక్షాత్తు ఆప్కోనే పవర్‌లూమ్ వస్త్రాలను చేనేత వస్త్రాల పేరుతో విక్రయిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాంతో పవర్‌లూమ్ ఉత్పత్తిదారులు చెలరేగిపోయేవారు. వైసీపీ ప్రభుత్వానికి ముందున్న ప్రభుత్వాలు పవర్‌లూమ్ విషయంలో కొంతమేర అప్రమత్తంగా ఉండడంతో రాష్ట్రంలో పవర్‌లూమ్ మగ్గాలు పెట్టడానికి ఎవరూ సాహసించలేదు. బెంగళూరు, చెన్నై, సేలంలలో మగ్గాలు పెట్టి అక్కడి నుంచి తెచ్చి విక్రయించేవారు. వైసీపీ ప్రభుత్వం పవర్‌లూమ్ విషయాన్ని పూర్తిగా వదిలేయడంతో నేరుగా రాష్ట్రంలోనే పవర్‌మగ్గాలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, మంగళగిరి సహా అనేక ప్రాంతాల్లో పవర్ మగ్గాలు పెట్టి, అక్కడే భారీగా ఉత్పత్తి చేసి చేనేత వస్త్రాలుగా మార్కెట్లోకి పంపిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా దానిపై చర్యలు తీసుకోవాలని, ఆప్కోలో నకిలీ వస్త్రాల విక్రయంతోపాటు, పవర్ మగ్గాలను నియంత్రించాలని నేతన్నలు కోరుకుంటున్నారు. అయితే ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం వైపు నుంచి అలాంటి చర్యలేవీ కనిపించలేదు.

ఘోరంగా దెబ్బతిన్న చేనేత మార్కెట్

చేనేత వస్త్రం అనేది ఒక బ్రాండ్ ఇమేజ్ ఉన్న ఉత్పత్తి. గత వైసీపీ హయాంలో చేనేత పేరుతో మార్కెట్లోకి వచ్చిన పవర్‌లూమ్ ఉత్పత్తులను కొన్న వినియోగదారులు ఘోరంగా మోసపోయారు. ఫలితంగా హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, చెన్నై, ముంబై, ఢిల్లీలలో ఉన్న అతిపెద్ద చేనేత మార్కెట్లన్నీ తమకు చేనేత వస్త్రాలు వద్దని బోర్డులు పెట్టాయి. ఫలితంగా రెండేళ్లుగా చేనేత ఉత్పత్తులన్నీ ఉత్పత్తిదారుల దగ్గరే ఆగిపోయాయి. దీంతో మాస్టర్ వీవర్లు ఉత్పత్తిని నిలిపివేశారు. కార్మికులకు పని కల్పించడం ఆపేశారు. 2020లో వచ్చిన కరోనా కూడా చేనేతను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. యజమానులు కార్మికుల శ్రమను ఘోరంగా దోచుకున్నారు.

భారీగా పెరిగిన ఉత్పాదక వ్యయం

చేనేతకు ప్రాణాధారమైన చిలపల నూలు ప్రియంగా మారిపోయింది. పట్టు ధర ఆకాశాన్ని అంటుతోంది. గతంలో 80 నెంబరు చిలపల నూలు డబ్బీ రూ. 1800 ఉండగా అది ఇప్పుడు రూ. 2,750కి పెరిగింది. 60 నెంబరు డబ్బీ రూ. 2,170, 40 నెంబరు డబ్బీ 1,350 కిలో పట్టు ధర ఒకప్పుడు రూ. 3 వేలు ఉండగా ఈ ఐదేళ్లలో రూ. 7 వేలకు పెరిగింది. వాటితోపాటు రంగులు, రసాయనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో చేనేత వస్త్రాల ఉత్పాదక వ్యయం పెరిగింది. కార్మికుల వేతనాలు తగ్గాయి. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై కూడా 5 శాతం జీఎస్టీ విధించింది. దాన్ని తొలగించాలని కష్టజీవులు ఏళ్ల తరబడి బతిమాలుతున్నా కేంద్రం మనసు కరుగలేదు. దీంతో ఆ భారాన్ని కూడా సగటు చేనేత కార్మికుడే మోయాల్సి వస్తోంది.

బడ్జెట్లోనూ చిన్న చూపే..

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో చేనేత వాటా దారుణంగా పడిపోయింది. కిందటేడాది కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు రూ. 200 కోట్లు కేటాయించారు. కానీ దానిని సవరణ బడ్జెట్‌లో రూ.190 కోట్లకు తగ్గించారు. తాజాగా 2024- 25 బడ్జెట్‌లో కూడా అవే రూ.200 కోట్లు కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మొత్తంగా జౌళీశాఖకు కేంద్రం రూ.4,392.85 కోట్లు కేటాయించగా అందులో చేనేతకు 4.5 శాతం మాత్రమే నిర్దేశించారు.

మాటలకే పరిమితమా?

ఈ ఏడాది ఆగస్టు 7న రాష్ట్ర ప్రభుత్వం చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఆ వేడుకల్లో పాల్గొని, తన సహచరి భువనేశ్వరికి రెండు చీరెలు కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని తద్వారా చేనేతను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అయితే అది ఎక్కడా ఆచరణకు నోచుకోలేదు. స్కూలు యూనిఫాంగా చేనేత వస్త్రాలను అందజేయాలన్న డిమాండ్ ఇప్పటి వరకూ ఆచరణకు నోచుకోలేదు.

తన భార్య భువనేశ్వరికి చేనేత చీర కొంటున్న సీఎం చంద్రబాబునాయుడు (ఫైల్)



చేనేతను ప్రభుత్వం ఆదుకోవాలి

- పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఏపీ చేనేత కార్మిక సంఘం



చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి. జీఎస్టీని తొలగించాలి. సహకార సంఘాలకు ఎన్నికలు జరపడంతో పాటు, రూ. 170 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి. విద్యార్థులకు యూనిఫామ్‌గా చేనేత వస్త్రాలనే వినియోగించాలి. చేనేత ముడిసరుకులపై రాయితీలు, సబ్సిడీలు అందజేయాలి. పవర్‌లూమ్ ఉత్పత్తులను నియంత్రించాలి

నిర్దిష్ట ప్రణాళికతో ప్రభుత్వం

- గుత్తికొండ ధనుంజయ్, టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రచార కార్యదర్శి



గత ప్రభుత్వంలో లాగా ఒక 70వేల మందికి డబ్బులిచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా, కార్మికులు తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం. జీఎస్టీ తగ్గింపుపై కేంద్రంతో మాట్లాడాం. మంగళగిరిలో మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన పైలట్ స్కీమ్ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రయత్నిస్తున్నాం.



ఆయా వృత్తుల్లో చేనేత కార్మికులు

కౌలు రైతులకు రుణాల కోసం ప్రత్యేక గ్రామ సభలు

- రుణాలు కోసం కౌలు రైతులను ప్రోత్సహిస్తున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా గ్రామ సభలు



పెదకకాని మండలం నంబూరులో ఏర్పాటు చేసిన కౌలు రైతుల రుణాల గ్రామ సభలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంతలోనే ఎంత మార్పు. గత ప్రభుత్వ హయాంలో కౌలు రైతులు రుణాల కోసం బ్యాంకు దగ్గరకు వెళ్తే దొంగల్లా చూసేవాళ్ళు. ఈ ప్రభుత్వం అదే కౌలు రైతుల దగ్గరకు బ్యాంకు అధికారులను పంపి రుణాలు ఇస్తాం రమ్మంటూ ఆహ్వానింప చేస్తోంది. కౌలు రైతులను రుణాలు తీసుకునేవిధంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక గ్రామ సభలను ఏర్పాటు చేసింది.

గుంటూరు జిల్లాలో కౌలు రైతుల రుణాల కోసం ఉద్దేశించిన గ్రామ సభలు శుక్రవారం ఆరంభం అయ్యాయి.కలెక్టర్ నాగలక్ష్మీ ఆదేశాల నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి,లీడ్ బ్యాంకు మేనేజర్, ఇతర అధికారులు ఒక బృందంగా ఏర్పడి ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలంలోని ఈమని, కొల్లిపర మండలంలోని వల్లభాపురం, పెదకాకాని మండలంలోని నంబూరులో గ్రామ సభలు నిర్వహించారు. కౌలు రైతు కార్డు కలిగిన రైతులను సభలకు ఆహ్వానించి, వారికి అవసరమయ్యే రుణాలు ఇస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు. నంబూరులో రుణం పొందేందుకు 492 మంది అర్హులైన కౌలు రైతులు వున్నారు. రుణం పొందేందుకు పొలం యజమాని అనుమతి కావాలని బ్యాంకర్లు సూచించగా కొందరు ఒప్పుకోగా, మరి కొందరు ఒప్పు కోలేదు. దీంతో కౌలు రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారికి రుణాలు మంజూరు చేయించేలా అధికారులు బ్యాంకర్లను ఒప్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతు కార్డు లు కలిగిన వారు సుమారు 12 వేల మంది ఉన్నారని అన్నారు. వారికి రుణాలు ఇప్పించేందుకు ఈ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రుణాలు మంజూరులో బ్యాంకర్లకు, రైతులకు మధ్య ఏర్పడే సమస్యలను పరిష్కరించి ప్రతి ఒక్కరికీ రుణం అందేలా చూస్తామని అన్నారు.

గ్రామ సభల వివరాలు..

కౌలు రైతులకు బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించే ఉద్దేశ్యం తో ఆరంభించిన గ్రామ సభల వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 18న కాకుమాను మండలంలోని రేటూరు,బోధిపాలెం, 21న గుంటూరు రూరల్ మండలంలోని జొన్నలగడ్డ, మేడికొండూరు మండలంలోని సిరిపురం,22 న ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు, పెదనందిపాడు మండలంలోని పాలపర్రు, తుళ్లూరు మండలంలోని పెదపరిమి, 23న దుగ్గిరాల మండలంలోని చిలుమూరు, పొన్నూరు మండలంలోని దొప్పలపూడి, 28న వట్టిచెరుకూరు మండలంలోని కొర్నేపాడు, పెదనందిపాడు మండలంలోని ఉప్పలపాడు, తాడికొండ మండలంలోని తాడికొండ, చేబ్రోలు మండలంలోని శలపాడు, 29న తెనాలి మండలంలోని కొలకలూరు, మంగళగిరి మండలంలోని నూతక్కి, ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, పొన్నూరు మండలంలోని మామిళ్లపల్లి గ్రామాల్లో సభలు జరగనున్నాయని అధికారులు తెలిపారు.

మేలు జాతి పశు సంతతి వృద్ధికి కృషి



- చమన్ సిద్ధమయ్యే వరకు కోడె దూడల పెంపకం
- వివిధ రాష్ట్రాలకు ఎగుమతి
- 25 ఎకరాల్లో గడ్డి సాగు
- ఆధునికీకరణ చేస్తే ఎంతో మేలు..

మేలు జాతి పశువులను అభివృద్ధి చేయటంలో కోడె దూడల పెంపక కేంద్రం కీలక భూమిక పోషిస్తోంది. నకరికల్లు మండలం నరసింగపాడుకు సమీపాన గుండ్లపల్లి రెవెన్యూ పరిధిలో గల కోడె దూడల పెంపక కేంద్రం పశు జాతి అభివృద్ధికి పల్నాడు జిల్లాకే తల మానికంగా నిలుస్తోంది. కోడె దూడల పెంపక కేంద్రాన్ని ఆధునీకరణ చేస్తే పశు జాతి అభివృద్ధి కొత్త పుంతలు తొక్కే అవకాశం ఉంది.

నకరికల్లు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు మండలం నరసింగపాడుకు సమీపాన గల గుండ్లపల్లి రెవెన్యూ పరిధిలో 530 ఎకరాల్లో ఈ కేంద్రం విస్తరించింది. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల కోడె దూడలను ఈ కేంద్రానికి తీసుకువచ్చి ఒకటిన్నర, రెండు సంవత్సరాల వయస్సు వరకు పెంచుతారు. చమన్ ఉత్పత్తికి సిద్దమయ్యే సమయానికి ఆ కోడె దూడలను చమన్ కేంద్రాలకు ఎగుమతి చేస్తారు. కోడె దూడలను పెంచే సమయంలో వాటికి అవసర మైన పశుగ్రాసం, వైద్య సేవలను అందించటం, కోడె దూడలను సంపూర్ణ ఆరోగ్యంగా తీర్చిదిద్దే విధంగా ఈ కేంద్రం తన కార్యకలాపాలను నిర్వహిస్తుంటుంది.

క్వారంన్‌టైన్‌లో కోడె దూడలు

మూడు నెలల వయస్సు నుంచి ఆరు నెలల వయస్సు గల కోడె దూడలను శ్రీనివాసనగర్‌లో గల క్వారన్‌టైన్ కేంద్రంలో ఉంచుతారు. ఇక్కడ ఉంచిన కోడె దూడల రక్త పరీక్షల నమూనాలను గురజాత్ రాష్ట్రంలోని ఆనంద్‌లో ఉన్న ప్రయోగశాలకు పంపుతారు. ప్రయోగశాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ఆ కోడె దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని నిర్ధారించుకు న్నాక కోడె దూడల పెంపక కేంద్రానికి తరలిస్తారు. జెర్సీ షాహీవాల్, రెడ్ సింధి రకాలకు చెందిన కోడె దూడలను ఇక్కడ పెంచుతున్నారు. ఈ కేంద్రంలో 66 కోడె దూడలు ఉండగా గత నెలలో బన్నాజీకి తొమ్మిది, నంద్యాలకు తొమ్మిది, తమిళనాడుకు తొమ్మిది తరలించారు. కాగా ప్రస్తుతం 39 కోడె దూడలు ఈ కేంద్రంలో ఉన్నాయి.



మేలు జాతి గడ్డి రకాల సాగు

కోడె దూడల పెంపకం కేంద్రంలో సూపర్ నేపియర్, రెడ్‌నేపియర్, బుల్లెట్ నేపియర్, పారా గడ్డి 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మరో ఐదు ఎకరాల్లో పిల్లి పెసర, జొన్న, ఉలవలు సాగు చేస్తు న్నారు. కోడె దూడలకు పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించేటువంటి చర్యల్లో భాగంగా ఇక్కడ ఈ గడ్డిని పెంచుతున్నారు. గడ్డి పెంచటానికి, కోడె దూడల సంరక్షణకు 15 మంది, వీరితో పాటు కార్యాలయంలో మరో 8 మంది ఉద్యోగులు పని చేస్తారు. వీరందరూ కాంట్రాక్ట్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇక్కడ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ హోదా కలిగిన పశు వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది.

మేలు జాతి పశువుల అభివృద్ధిలో కోడెదూడల పెంపక కేంద్రం

మేలు జాతి పశువుల అభివృద్ధికి కోడెల దూడల పెంపక కేంద్రం ఎంతో ఉపయోగ పడుతుంది. క్వారంటైన్ నుంచి వచ్చిన కోడె దూడలను సమాయానికి తగ్గట్టుగా వ్యాక్సినేషన్ ఇవ్వటం, డీ వార్మింగ్ చేయటం, పోషకాలతో కూడిన పశు గ్రాసాన్ని కోడె దూడలకు అందించటం వంటి కార్యకలాపాలను ఈ కేంద్రంలో నిర్వహిస్తున్నాం. కోడె దూడలు చమన్ ఉత్పత్తికి సద్దమయ్యే సమయానికి ఉన్నతాధికారుల ఆదేశానుసారం దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తాము.



డాక్టర్ మదన్, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు

కోడె దూడల పెంపకం కేంద్రంలో అందించే సేవలు

కోడె దూడల పెంపక కేంద్రంలో క్వారంటైన్ కేంద్రం నుంచి వచ్చిన కోడె దూడలను సంవత్సరన్నర కాలం నుంచి రెండు సంవత్సరాల వరకు వాటికి పోషక విలువలతో కూడిన గడ్డి రకాలను ఆహారంగా అందిస్తారు. ఎప్పటికప్పుడు వ్యాధులు సంక్రమించ కుండా వ్యాక్సినేషన్ ఇస్తారు. డీ వార్మింగ్ చేయిస్తారు. సంపూర్ణ ఆరోగ్యం కలిగి కోడె దూడల నుంచి చమన్ ఉత్పత్తి చేయటానికి సిద్ధంగా ఉన్నాయని ధ్రువీకరించిన తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న చమన్ కేంద్రాలకు ఎగుమతి చేస్తారు. అక్కడి నుంచి చమన్ ద్వారా మేలు జాతి పశువులను ఉత్పత్తి చేస్తారు.

ఉరుసు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డు హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా (మస్తానయ్య దర్గా) 133వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబావారి సమాధిపై గంధ మహోత్సవం కార్యక్రమం వేడుకగా జరిగింది. దర్గా వంశపారం పర్య ధర్మకర్త రావి రామ్మోహనరావు బాబావారి గంధాన్ని కన్నావారితోట నుంచి దర్గా మీదగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు గంధ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మేళ తాళాలతో విద్యుత్ దీప కాంతుల నడుమ నగరంలో ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. ఉరుసు మహోత్సవాల తొలి రోజు పురస్కరించుకుని బాబా వారిని ప్రజా ప్రతినిధులు దర్శించి చద్దురును సమర్పించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. శనివారం గంధం పంపిణీ, దీపారదన నిర్వహించనున్నట్లు ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు.



మస్తాన్‌బాబా సమాధి

పంట నమోదుతోనే పథకాల వర్తింపు

అద్దంకి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈ-పంట నమోదు తోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. దేసువకొండ, గోపాలపురం గ్రామాలలో శుక్రవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజ్ మాట్లాడుతూ గ్రామాలలో పంటలను సాగు చేసే రైతులు తమ పంట వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయఅధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మంచు కారణంగా వరి పంటలో కంకులలో మానికాయ ఏర్పడిందని, తద్వారా పంట దెబ్బతినకుండా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివ రించారు ఉద్యాన అధికారి దీప్తి మాట్లాడుతూ రాయితీపై తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వీరేష్, జొన్నలగడ్డ కృష్ణ, యర్రా రాఘవయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టండి

పంగులూరు : మొక్కజొన్నలో కత్తెర పురుగు అధికంగా ఉందని దాని నివారణకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో శుక్రవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో పృథ్వీసాయి, రైతులు పాల్గొన్నారు.

తెల్లబాడు పాఠశాల ఆట స్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతికి స్పందన


తెల్లబాడు గ్రామస్థులతో చర్చిస్తున్న తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది

దొనకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు జడ్పీ పాఠశాలకు కేటాయించిన ఆట స్థలాన్ని తహసీల్దార్ బి.రమాదేవి పరిశీలించారు. కబ్జాకోరల్లో ఆటస్థలం శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ రమాదేవి తన సిబ్బందితో తెల్లబాడు గ్రామంలోని సర్వేనెంబర్ 178/2లోని ప్రభుత్వ భూమిని రికార్డుల మేరకు పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక వారి ఆదేశాల మేరకు త్వరలో పాఠశాలకు ఆటస్థలం కేటాయించేలా తగిన చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి గ్రామాల్లో రీసర్వే


సమావేశంలో మాట్లాడుతున్న జేసి గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 38 మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో ఈనెల 20వతేదీ నుంచి రీసర్వేను ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో శుక్రవారం రీసర్వేపై సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 38 గ్రామాల్లో 136 బ్లాకులుగా ఏర్పాటుచేసి 64,904.04 ఎకరాలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం 126 మందితో ఫీల్డ్ వర్క్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సర్వే గ్రామాల్లో విస్తీర్ణాన్ని బట్టి నాలుగైదు బృందాలను కేటాయిస్తామన్నారు. ఒక్కొక్క బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ ఉంటారన్నారు. సర్వే జరిగే గ్రామానికి చెందిన రైతులకు, గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే భూయజమానులందరికి నోటీసులు ఇచ్చి రశీదులు తీసుకుంటామన్నారు. సర్వే జరిగే గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సభలు, ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రైవేటు భూముల సర్వే ఉమ్మడి ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌గా కాకుండా ప్రతి రైతుకు ఒక ఎల్‌బీఎం వచ్చేలాగా రోవర్ ద్వారా సర్వే చేస్తామని తెలిపారు. సర్వేకు ముందు గ్రామసభ ఏర్పాటు చేసి అందులో వచ్చే సమస్యలను రికార్డులను నమోదు చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవగాహన సదస్సులకు సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలతోపాటు తహసీల్దార్లు కూడా పాల్గొంటారని వెల్లడించారు. ప్రతి రైతుకు సంబంధించిన భూమి రికార్డుల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి షేక్ గౌస్‌బాషా పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

భారీ ఏర్పాట్లలో తెలుగు తమ్ముళ్లు

ఒంగోలు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతి కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి కాగా ఆ కార్యక్రమానికి కేడర్ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది కావడంతో కార్యకర్తలు మరింత ఉత్సాహంగా కనిపిస్తున్నారు. నియోజకవర్గం యూనిట్‌గా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వర్ధంతి కార్యక్రమాలపై దృష్టిసారించి గ్రామగ్రామాన కార్యక్రమాలు జరిగేలా సిద్ధమయ్యారు. అన్నిచోట్ల ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులతోపాటు సభలు, ఆ సందర్భంగా రక్తదాన శిబిరాలు, భారీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను కూడా టీడీపీ శ్రేణులు చేపడుతున్నారు. టంగుటూరు మండలం కందులూరులో ఎన్టీఆర్, దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ జరగనుంది. కార్యక్రమానికి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆహ్వానంతో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారు.



వర్ధంతి సభ కోసం సిద్ధం చేసిన వేదిక

శీనారెడ్డి ఇష్టారాజ్యం


శీనారెడ్డిని విచారిస్తున్న త్రిసభ్యకమిటీ సభ్యులు

- త్రిసభ్య కమిటీ విచారణలో వెలుగులోకి అక్రమాలు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్
- స్వప్రయోజనాలు, అక్రమార్జనే లక్ష్యంగా పాలన
- కొందరు ఉద్యోగుల భాగస్వామ్యం
- కలెక్టర్ పరిశీలనలో నివేదిక
- చర్యలపై డ్వామా సిబ్బందిలో ఆందోళన

డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో పెద్ద ఎత్తున అవకతవకలు, అక్రమాలు జరిగాయి. ప్రభుత్వనిబంధనల బేఖాతర్ చేస్తూ తన స్వప్రయోజనం, అక్రమార్జనే లక్ష్యంగా నాలుగున్నరేళ్ళు పీడీగా ఆ సంస్థలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. తనకు నమ్మకస్తులైన ఉద్యోగులను కొందరిని కేంద్రంగా చేసుకొని జిల్లా కార్యాలయంలో పెద్ద ఎత్తున సాగించిన ఆయన అక్రమమాలలో పలువురు సిబ్బంది కూడా భాగస్వామ్యులయ్యారు. భారీగా ప్రజాధనం దుర్వినియోగం, అక్రమార్జన జరిగింది. శీనారెడ్డి పీడీగా ఉన్న కాలంలో జరిగిన వ్యవహారాలపై విచారణ చేపట్టిన త్రిసభ్య కమిటి తమ విచారణలో అనేక అక్రమాలు, అవినీతి, అవకతవకలును గుర్తించింది. ప్రధాన అశాల వారీగా కమిటి సభ్యులు ఇటీవల తమ నివేదికను కలెక్టర్‌తమీమ్ అన్సారియాకు అందజేయగా శీనారెడ్డి తో పాటు అక్రమాలకు బాధ్యులపై చర్యలుకోసం సదరు నివేదికను కలెక్టర్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో నాటి ప్రజాప్రతినిధులు, కీలక నేతల కన్నా మిన్నగా జిల్లానీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ శీనారెడ్డి వ్యవహరించాడన్న ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. అంతేకాకుండా ఇతర పలు శాఖల వ్యవహారాల్లో నాటి అధికారపార్టీ కీలక నేత అండతో జోక్యం చేసుకోవడమే కాక డ్వామాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి వైసీపీ నేతలకు లాభం చేకూర్చారన్న ప్రచారం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించుకోకుండా సిబ్బంది నియామకాలు, బదిలీలు, సామాజిక తనిఖీలను చేశారు. నచ్చని ఉద్యోగులను వేధించడంతోపాటు నచ్చిన వారిని వెనుకేసుకొచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక శీనారెడ్డి అవినీతి, అక్రమాలు, అవకతవకలు, ప్రజాధనం దుర్వినియోగం నిబంధనలకు విరుద్ధంగా ఆయన సాగించిన వ్యవహారాలపై విచారణ కోరుతూ పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో శీనారెడ్డి వ్యవహారంపై విచారణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి శివనారాయణరెడ్డి, సైప్ సీఈవో శ్రీమన్నారాయణతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ తమీమ్ అన్సారియా నియమించారు. సదరు కమిటీ దాదాపు నెలన్నర రోజులపాటు డ్వామా కార్యాలయం కేంద్రంగా విచారణ సాగించింది. 70 వరకు ఫిర్యాదులు అందగా వాటిలో ఇంచుమించు 25 నుంచి 30 వరకు అందరూ ఫిర్యాదులలో ఉన్నట్లు గుర్తించిన త్రిసభ్య కమిటీ అధికారులు వాటి మీద ప్రధాన దృష్టి సారించారు.

అంతా దాటవేత ధోరణే

అందుబాటులో ఉన్న ఫైళ్లను పరిశీలించిన అనంతరం శీనారెడ్డితో పాటు ఫిర్యాదులో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఉన్న ఉద్యోగులు, ఆయా విభాగాల సిబ్బంది అలాగే ఫిర్యాదుదారులను వ్యక్తిగతంగా విచారించారు. ఈక్రమంలో శీనారెడ్డికి లిఖిత పూర్వకంగా రెండుసార్లు నోటీసులు ఇచ్చి ఆయన కోరిన గడువును కూడా ఇచ్చి ఈనెల 2న వ్యక్తిగతంగా విచారణ చేశారు. కొన్ని అంశాలపై మౌఖికంగా, కొన్నింటిపై రాతపూర్వకంగా ఆ సమయంలో ఆయన వివరణ ఇచ్చినా కమిటీ సభ్యులు ప్రశ్నించిన పలు అంశాలపై దాటవేత ధోరణితో వ్యవహరించారని గుర్తించిన వారు ఆయా అంశాలపై మరింత వివరంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని సూచించగా ఇవ్వలేదని సమాచారం. ఇక ఫిర్యాదుదారులు ఐదుగురుకి, డ్వామా ఉద్యోగులు, పూర్వ ఉద్యోగులు 44మందికి విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చిన కమిటీ ఈనెల 8, 9 తేదీల్లో విచారణ చేసింది. అందులో నలుగురు ఫిర్యాదుదారులు, 39మంది ఉద్యోగులు విచారణకు హాజరు కాగా వారిని విచారించి వారి నుంచి కూడా లిఖిత పూర్వకంగా వివరణలు తీసుకున్నారు.

కలెక్టర్‌కు నివేదిక అందజేత

దాదాపు పది రోజులకు పైగా డ్వామా కార్యాలయంలో ప్రత్యక్షంగా ఫైళ్ల పరిశీలన, ఉద్యోగులను విచారించిన వారు ఇతర సమయాల్లో తమ వద్ద ఉన్న ఫిర్యాదులు, ఉద్యోగులు ఇచ్చిన వివరణలు, రికార్డుల పరిశీలన చేసి సంక్రాంతికి ముందే తమ నివేదికను కలెక్టర్ అన్సారియాకు అందజేశారు. ఆ విచారణ కమిటీ పలు అంశాలపై సమగ్రంగానే విచారణ చేపట్టడంతోపాటు శీనారెడ్డి పీడీగా ఉన్న కాలంలో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగిన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వాటన్నింటిని సవివరంగా వారు కలెక్టర్‌కు నివేదించడంతో ప్రస్తుతం వాటిని కలెక్టర్ నిశిత పరిశీలన చేస్తున్నారు. దీంతో తమపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఆందోళన గతంలో శీనారెడ్డితో అంటకాగిన డ్వామా ఉద్యోగులలో కనిపిస్తోంది. త్రిసభ్య కమిటీ గుర్తించి కలెక్టర్‌కు నివేదించిన కొన్ని అంశాలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

- జిల్లాలో ఉపాధి పనులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, కూలీలతో కాకుండా దొంగ మస్టర్లతో, యంత్రాలతో పనులు చేసి బిల్లులు డ్రా చేశారన్న ఫిర్యాదులపై డ్వామా పీడీగా శీనారెడ్డి ఉన్న కాలంలో రాష్ట్ర కమిషన్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక తనిఖీ బృందాలు కొండపి. అర్ధవీడు, పెద్దారవీడు, కేకేమిట్ల, దోర్నాల మండలాల్లో పరిశీలన చేసి అక్రమాలు గుర్తించారు. అందుకు బాధ్యులుగా 25మంది అప్పట్లో సస్పెండ్ అయ్యారు. అయితే రాష్ట్ర బృందాలు తనిఖీ చేసిన పనులను శీనారెడ్డి రీవెరిఫికేషన్ పేరుతో ఒక ఏపీడీ నేతృత్వంలో పరిశీలన చేయించి సస్పెండైన వారికి తిరిగి పోస్టింగులు ఇచ్చారు. రీ వెరిఫికేషన్ అధికారం లేకున్నా చేయించడం, సస్పెండైన వారికి పోస్టింగ్‌లు ఇవ్వడాన్ని విచారణ కమిటీ తప్పుబట్టింది. కనీసం రీవెరిఫికేషన్‌కు అటు కమిషనర్ నుంచి కాని ఇటు కలెక్టర్ నుంచి కాని అనుమతి తీసుకోలేదని గుర్తించారు.
- జగనన్న కాలనీల్లో లెవలింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణం, ఇతర పనులకు భారీగా ఉపాధి నిధులు ఖర్చుచేయగా వాటిలో అనేక అక్రమాలు జరిగి నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. చేసిన పనులకు రికార్డులు లేకపోవడాన్ని కమిటీ గుర్తించింది. ఉదాహరణగా ఒంగోలు మండలం చేజర్ల కాలనీ పనులు రికార్డులు పరిశీలించగా అక్రమాలు నిజమని తెలినట్లు సమాచారం. ఒంగోలుకు సంబంధించి యరజర్ల వద్ద తొలుత వేసిన లే అవుట్‌కు ఉపాధి నుంచి నిధులు ఇవ్వడానికి అవకాశం లేదని శీనారెడ్డి లిఖితపూర్వకంగా ఇవ్వగా, రూ.34కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. అక్కడ ఇళ్ల స్థలాలు పంపిణీ నిలిచిపోగా అప్పటి వైసీపీ నేతల లబ్ధికోసం శీనారెడ్డి అలా లెటర్ ఇచ్చినట్లు కమిటీ గుర్తించింది. ఆ లేఖకు సంబంధించి డ్వామా కార్యాలయంలో ఎలాంటి ఉత్తర, ప్రత్యుత్తరాలు కూడా లేవని గమనించారు.
- ఒంగోలు ఏపీడీ కాత్యాయిని కొంత కాలం అనారోగ్యంతో సెలవులో, మరికొంతకాలం కార్యాలయంలో లేని సమయంలో వెంకటస్వామిని ఇన్‌చార్జిగా నియమించారు. అతని అద్దెకారు వాడుకునే ప్రొవిజన్ లేకపోగా కాత్యాయినితో టూర్ డైరీపై సంతకాలు చేయించి వెంకటస్వామికి బిల్లులు ఇచ్చారు. శీనారెడ్డి ఆదేశాలతో తాను అలా సంతకాలు పెట్టినట్లు కాత్యాయిని కమిటీ ముందు చెప్పినట్లు సమాచారం. కిందిస్థాయి ఉద్యోగికి పైస్థాయి అధికారి ఇన్‌చార్జీ బాధ్యతలు ఇచ్చేటప్పుడు కమిషనరేట్ లేదా కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉండగా ఒంగోలు ఏపీడీగా వెంకటస్వామి, కందుకూరు ఏపీడీగా సుభాషిణిలను ఇన్‌చార్జీగా నియమించడమే కాక వారికి లేని వాహన ప్రొవిజన్ కల్పించారు. తద్వారా తమపై స్థాయి అధికారులైన ఎంపీడీవోలను అజమాయిషీ చేసే అధికారాన్ని, నిబంధనలకు విరుద్ధంగా వారికి కట్టబెట్టారు.
- ఏపీడీగా పనిచేస్తున్న వెంకటస్వామి వాస్తవానికి జడ్పీలో సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగికాగా డ్వామా విజిలెన్స్ విభాగం పర్యవేక్షకునిగా తొలుత డిప్యూటేషన్‌పై తీసుకొని కొంతకాలం తర్వాత ఏకంగా జిల్లా విజిలెన్స్ అధికారిగా, మరికొంతకాలం తర్వాత పది మండలాలకు పర్యవేక్షణ ఉండే ఒంగోలు ఏపీడీగా ఇన్‌చార్జీ బాధ్యతలు ఇచ్చారు. ఆ సమయంలో విజిలెన్స్ విభాగంలో పలు అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటికి కూడా సదరు వెంకటస్వామి ఏపీడీగానే కొనసాగుతున్నారు.
- ఒంగోలు క్లస్టర్ శిక్షణ కేంద్రం నిధుల వినియోగంపై ఏపీడీ కేంద్ర డైరెక్టర్‌లకు జాయింట్ చెక్ ఫవర్ కాగా వారికి సంబంధం లేకుండా అటెండర్ రూ.14లక్షలు బ్యాంకు నుంచి ఆరునెలల వ్యవధిలో డ్రా చేశాడు. ఆ విషయాన్ని ఏపీడీ కాత్యాయిని, డైరెక్టర్ లలితాదేవిలు పీడీ శీనారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. క్రిమినల్ కేసు నమోదు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ ఇద్దరిని సస్పెండ్, అలాగే అటెండర్‌ను డిస్మిస్ చేయాల్సి ఉండగా తాత్కాలికంగా అటెండర్‌ను సస్పెండ్ చేశారు. తర్వాత నగదు తిరిగి కట్టాడని చెప్పి మళ్లీ అటెండర్‌కు ఉద్యోగం ఇచ్చారు. ఇందులో ఏపీడీ వెంకటస్వామిని విచారణ అధికారిగా పెట్టి నామమాత్రంగా చేపించినట్లు కమిటీ గుర్తించింది.
- డ్వామాలో పీడీ కన్నా ముందు గతంలో కొంతకాలం ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేసిన శీనారెడ్డి ఆ సమయంలో ప్రభుత్వ ఉద్యోగి అయిన తన భార్య పేరుతో అద్దె వాహనం పెట్టుకొని బిల్లులు డ్రా చేశారు. ఇక పీడీ అయ్యాక నిబంధనల ప్రకారం నెలకు రూ.45వేలు అద్దె చెల్లింపు చేయాల్సి ఉండగా ఏకంగా రూ.60వేలు డ్రా చేశారు.
- సామాజిక తనిఖీలు అంతా ప్రహసనంగా ఆయన కాలంలో సాగాయి. బృందాలు ఒక మండలంలో రూ.2కోట్లు అక్రమాలు జరిగాయని గుర్తిస్తే ప్రజావేదికలో దానిని తగ్గించి కొందరు సిబ్బందిని సస్పెండ్ చేశారు. అనంతరం వ్యక్తిగత విచారణ పేరుతో పిలిచి మాట్లాడుకొని మరింత తగ్గించి రికవరీలు చేయకుండా తిరిగి పోస్టింగ్‌లు ఇచ్చారు. దోర్నాల మండలంలో ఒక వ్యక్తి అనేకమంది వేలిముద్రలు వేసి అక్రమంగా ఉపాధి డబ్బులు స్వాహా చేయడాన్ని గుర్తించిన కమిటీ ఈ వ్యవహారాల్లో శీనారెడ్డితోపాటు నాటి విజిలెన్స్ విభాగం సిబ్బంది కూడా ఉన్నట్లు తేల్చింది.
- కొన్నిచోట్ల ఆడిట్ నివేదికల ఆధారంగా సిబ్బందిపై చర్యలు తప్పని పరిస్థితి ఎదురైతే కలెక్టర్‌కు నివేదించి సస్పెండ్ చేయించి తర్వాత తనకు నచ్చిన వారికి గుట్టుచప్పుడు కాకుండా తానే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇష్టం లేని వారిని డిస్మిస్ చేయడం, కనీసం వారికి సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఈ విషయం కమిటీ గ్రహించడంతో పాటు కలెక్టర్ అనుమతి లేకుండా పోస్టింగ్‌లు ఇచ్చారని గుర్తించారు.
- డ్వామాలో నిరంతరం వివిధ అంశాలపై శిక్షణా కార్యక్రమాలు నడుస్తుంటాయి. అలాగే స్టేషనరీ వాడకం కూడా అధికంగా ఉంటుంది. వీటికి సంబంధించి కార్యాలయంలో శీనారెడ్డికి నమ్మకస్తుడిగా ఉండే ఒక ఉద్యోగి భార్య పేరుతో ఉన్న క్యాటరింగ్, స్టేషనరీకి ఏజెన్సీల ద్వారా ఖర్చుచేసినట్లు కమిటీ గుర్తించింది. ఆ బిల్లులు కూడా కమిటీ ముందు ప్రస్తుత ఉద్యోగులు సమర్పించకపోవడంతో అక్రమాలు జరిగినట్లు తేల్చారు.
- డ్వామాలోని విజిలెన్స్ విభాగం, సోషల్ ఆడిట్, హెచ్‌ఆర్‌తోపాటు పలు సెక్షన్లలో అవినీతి వేళ్లూనుకుపోయినట్లు, కొందరు ఉద్యోగుల పాత్ర అందులో ఉన్నట్లు కమిటీ గుర్తించి వారి పేర్లతో సహా తమ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. లంచాలు కూడా ఫోన్ పే ద్వారా జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన కమిటీ శీనారెడ్డి అలాగే విజిలెన్స్ విభాగంలోని ఉద్యోగి మొబైల్ నెంబర్లకు ఉన్న బ్యాంకు అకౌంట్లను కూడా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.
- డ్వామాలో వాడిన అద్దె వాహనాలు, చెల్లించిన బిల్లులు, స్టేషనరీ, క్యాటరింగ్ బిల్లులు, జలసిరి, ఈజీఎస్ బిల్లుల ఫైళ్ల అనేకం అందుబాటులో లేవంటూ సిబ్బంది కమిటీకి సమర్పించలేదు. దీంతో మరోసారి సమగ్రంగా వివరణ ఇవ్వాలని శీనారెడ్డికి సూచించినా రాకపోవడం, కమిటీకి సహకరించాలని ప్రస్తుత పీడీ రాతపూర్వకంగా ఉత్తర్వులు ఇచ్చినా కొందరు ఉద్యోగులు దాటవేత వైఖరితో ఉండటం వంటి అంశాలను కూడా కమిటీ తమ నివేదికలో పేర్కొంటూ బాధ్యులపై చర్యలతోపాటు డ్వామా కార్యాలయంలో సిబ్బంది మార్పులు, చేర్పులు చేయడం అవసరంగా సూచించినట్లు తెలిసింది.

నాటక రంగానికి ప్రాణం పోస్తున్న కళాపరిషత్‌లు

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


కళాపరిషత్ వేదికపై మాట్లాడుతున్న మాజీ మంత్రి పుల్లారావు

యద్దనపూడి (మార్టూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కళలు, కళాకారులకు, నాటక రంగాలకు కళాపరిషత్‌లు ప్రాణం పోస్తున్నాయని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు అన్నారు. ఆరికంగా ఎంతకష్టమైనా కళాపరిషత్‌లను నిర్వహిస్తున్నవారిని ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో మూడోరోజు శుక్రవారం రాత్రి ప్రదర్శించిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలకు పుల్లారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు సభాధ్యక్షునిగా వేదికపైకి ఆహుతులను కందిమళ్ల సాంబశివరావు ఆహ్వానించారు. ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతోమంది కళాకారులు రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన వారున్నారన్నారు. ప్రేక్షకుల చప్పట్లతో రంగస్థల కళాకారులు ఎంతోమంది తమ జీవితాలను నాటక రంగానికి అంకితం చేశారన్నారు. మనందరం కళలను బతికించుకోవాలి, కళాకారులను ప్రోత్సహించాలి, భావి తరాలకు కళాపరిషత్‌లను నిర్వహించాలన్న ఆసక్తిని పెంపొందించాలన్నారు. ఇంకా ఆత్మీయ అతిథులుగా టీవీ విశ్లేషకులు కందుల రమేష్, తెలుగు టీవీ నిర్మాతల మండలి అధ్యక్షుడు ఆరికట్ల ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమం చివరగా టీవీ విశ్లేషకులు ఇడుపులపాటి సాంబశివరావును కళాపరిషత్ సభ్యులు ఎమ్మెల్యే పుల్లారావు, తదితర అతిథులతో కలిసి దుశ్శాలువ, పూలమాలలో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

73 రోజులు.. రూ.363.25 కోట్లు

(1వ పేజీ తరువాయి)

మున్సిపాల్ అధికారుల తీరు పరిశీలిస్తే కష్టమనిపిస్తోంది. చిలకలూరిపేట, గుంటూరు కార్పొరేషన్, బాపట్ల మున్సిపాల్టీలలో పన్ను వసూళ్ల దారుణంగా ఉంది. మంగళగిరి-తాడేపల్లి, పిడుగురాళ్ల, అద్దంకి మున్సిపాల్టీల్లో మాత్రం పన్ను వసూలు మెరుగ్గా ఉంది. ఆదాయ వనరులను పెంచుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనేందుకు పన్నుల వసూళ్లే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నా అధికారుల్లో స్పందన లేదు. ప్రకటనలు, తాత్కాలిక ఆక్రమణల పన్నులు పక్కదారి పడుతున్నాయి.

జీతాల చెల్లింపుల్లో జాప్యం

పన్నుల వసూళ్లు, ఆదాయ వనరులు అంతంత మాత్రంగా ఉండటంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వాహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్లు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పర్చూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి) పర్చూరు మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటలకు ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డీసీసీబీ ఎవరికో?



- పర్సన్ ఇన్‌చార్జి నియామకంపై కసరత్తు
- పరిశీలనలో ముందున్న డాక్టర్ సీతారామయ్య, వీరయ్య పేర్లు
- భవిష్యత్తులో ఎన్నికల వ్యయభారాన్ని మోయాలని ఆంక్ష
- డాక్టర్ పేరును ప్రతిపాదించిన ఎమ్మెల్యే దామచర్ల
- ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఇద్దరి సిఫార్సు లేఖలపై సంతకాలు చేసిన వైనం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లా పరిధిలో జిల్లా పరిషత్ తర్వాత ఆ స్థాయి ప్రాధాన్యత గల జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పూర్తిస్థాయి ఆధిపత్యం కోసం అధికార టీడీపీ నాయకులు దృష్టిసారించారు. అందులోభాగంగా ముమ్ముందు రాబోయే సహకార ఎన్నికలు కూడా దీటుగా ఎదుర్కొనే వారితో పాలకమండలిని నియమించే విషయంపై కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ పాలకమండలిలో కిందిస్థాయి సొసైటీల్లో అధికారులతో కూడిన త్రీమెన్ కమిటీలు ఉన్నాయి. వాటి స్థానే రాజకీయ నేతలతో కూడిన త్రీమెన్ కమిటీలు నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కిందిస్థాయిలో సొసైటీల త్రీమెన్ కమిటీ నియామకాలపై ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జులు కుస్తీ పడుతున్న విషయం తెలిసిందే. సొసైటీలతోపాటు జిల్లా బ్యాంకుకు కూడా ఒక పర్సన్ ఇన్‌చార్జిని ఇద్దరు లేక ఐదుగురు సభ్యులుగా ఉండే పాలకమండలిని నియమించాలని భావిస్తుంది. ఆ మేరకు ఇప్పటికే ఈ విషయంపై టీడీపీ నాయకులు దృష్టిపెట్టి పరిశీలన చేస్తున్నారు.

ఎన్నికల బాధ్యత తీసుకోవాల్సిందే

కొంతకాలం క్రితం డీసీసీబీ విషయమై తాడేపల్లిలోని మంత్రి రవికుమార్ నివాసంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఇతర ముఖ్య నాయకులు సమావేశమై చర్చించారు. అంతకుముందు ఒంగోలులో జరిగిన ఒక సమావేశంలో కూడా ఈ విషయంపై వారి మధ్య చర్చలు జరిగాయి. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిని ఎవరిని నియమించినా వారే భవిష్యత్తు సహకార ఎన్నికల బాధ్యత తీసుకునే విధంగా చూసుకోగలగాలని తదనుగుణంగానే ప్రస్తుత ఎంపిక జరగాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల సమయంలో వ్యయాన్ని భరించగలిగిన వారే ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి పదవి కోసం ముందుకు రావాలని టీడీపీ నాయకులు ఆశావాహులకు సూచించారు.

పరిశీలనలో ముందున్న ఆ ఇద్దరు

ప్రస్తుతం పీడీసీసీబీ కోసం పలువురు ప్రయత్నం చేస్తున్నారు. అలా ప్రయత్నించే వారిలో ప్రస్తుతానికి ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యల పేర్లు పరిశీలనలో ముందున్నట్లు తెలుస్తోంది. ఒంగోలులోని వెంకటరమణ వైద్యశాల యాజమాన్య భాగస్వామి అయిన డాక్టర్ సీతారామయ్య పేరును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రతిపాదించారు. డాక్టర్ సీతారామయ్య తండ్రి డాక్టర్ రమణారావు 1989 ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత సీతారామయ్య వైద్య వృత్తిలో వచ్చినప్పటి నుంచి టీడీపీలో కొనసాగుతూ తన వంతు పాత్ర పోషిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 నుంచి ప్రతి ఎన్నికల్లో దామచర్లకు మద్దతుగా పనిచేశారు. అయితే సెంట్రల్ బ్యాంకులో తక్కువ సింగిల్ విండోలు ఉన్న నియోజకవర్గం ఒంగోలు. దీంతో ఈ విషయాన్ని కొందరు ప్రస్తావించగా ఎమ్మెల్యే దామచర్ల తన ప్రతిపాదనను అంగీకరించాలని కోరటంతో మిగిలిన వారు సైలెంట్ అయ్యారు. ఆయన పేరును దామచర్ల ప్రతిపాదించగా ఆ సిఫార్సు లెటర్‌పై కొత్త ప్రకాశం జిల్లాలోని ముఖ్య నాయకులు, మంత్రి స్వామితో సహా అందరూ సంతకాలు చేయగా మిగిలిన నాయకులు కూడా మద్దతు ఇచ్చినట్లు తెలిసింది. కాగా మరోవైపు మాజీ ఎంపీపీ వీరయ్య కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయన కూడా సంతకాల సేకరణ జరిపినట్లు తెలిసింది. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో సహా ప్రకాశం జిల్లాలోని ఎక్కువ మంది నాయకులు ఆయన సిఫార్సు లేఖపై కూడా సంతకాలు చేశారు. దామచర్ల మాత్రం సీతారామయ్యవైపే ఉన్నారు. మంత్రులు రవికుమార్, స్వామిలు అధిష్టానం నిర్ణయాన్ని కాదనలేమని ఎవరి ప్రయత్నం వారు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

బాబు, లోకేష్‌లను కలిసి విన్నపం

ఇటు సీతారామయ్య అటు వీరయ్య ఇద్దరు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను కూడా కలిసి సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఇద్దరు నాయకులు కూడా లోకేష్ దృష్టిలో ఉన్నారనేది సమాచారం. ఈ ఇరువురు కాకుండా మరికొందరు నాయకులు కూడా తమకు అవకాశం ఇవ్వాలని అటు బాబును ఇటు లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య కూడా ఆప్కాబ్ చైర్మన్ పదవికి తన పేరును పరిశీలించాలని కోరారు. ఆప్కాబ్ చైర్మన్ కావాలంటే ముందుగా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికవ్వాలి. ఆ రకంగా ఆయన కూడా సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆప్కాబ్ చైర్మన్ పదవిని గోదావరి జిల్లాలో ఒకరికి కేటాయించాలని మంత్రి లోకేష్ ఆలోచిస్తున్నట్లు కూడా సమాచారం.

కన్నెర్ర కట్టడి చేస్తారా?



వాడరేవు తీరంలో సీఆర్‌జడ్ పరిధిలో జరుగుతున్న రిసార్ట్ నిర్మాణం



వాడరేవు తీరంలో సీఆర్‌జడ్ పరిధిలో జరుగుతున్నరొయ్యల ప్రాసెసింగ్ షెడ్లకు వేసిన పిల్లర్లు

- సీఆర్‌జడ్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించేనా
- ఆ కందిరీగల తుట్టెను కదిలించే సాహసం ఆయా శాఖల అధికారులు చేస్తారా?
- ఉన్నతాధికారుల ప్రొటోకాల్ పేరుతో పరస్పర సహకారం అందించుకుంటున్నారనే ఆరోపణలు
- అనధికారిక నిర్మాణాలు పరిశీలించిన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విస్తారమైన సముద్రతీరం జిల్లా సొంతం. పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అనుకూలమైన వనరులు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ ప్రత్యేక దృష్టి. నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చే కోణంలో ప్రభుత్వ ఆలోచనలు. సానుకూల అంశాలు. జిల్లా పరిధిలో తీరప్రాంతం అత్యధికంగా చీరాల నియోజకవర్గంలో ఉంది. ఇదిలావుంటే తీరంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించడం, అసైన్డ్, పట్టా భూములు అనే తేడా లేకుండా ఆఖరికి తీరానికి రక్షణ కవచంగా ఉండాల్సిన మడ చెట్లను కూడా మాయం చేసి, సంబంధిత శాఖల నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు లేకుండా చేపట్టిన, చేపడుతున్న (రిసార్ట్స్, హోటల్స్) నిర్మాణాలు ప్రతికూల అంశాలు.

క్రమబద్ధీకరిస్తారా..

కన్నెర్ర చేస్తే అనుమతులు పొందనివారు అనుమతి పొందుతారు. కట్టడి చేస్తే కొంతగా అనుమతులు లేకుండా మరొకరు ముందడుగే వేయరు. క్రమబద్ధీకరిస్తే కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమవుతాయి. మూడు చేస్తే ప్రక్షాళన జరుగుతుంది. లేదంటే ఒకరిని చూచి మరొకరు సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించడం కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సీఆర్‌జడ్, కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, ఒడా తదితర శాఖల నుంచి పక్కాగా అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టాలి. ఆ తరువాత నిర్వహణ కూడా నిబంధనల మేరకు చేపట్టాలి. నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంతంలో చిన్నా, పెద్దా రిసార్ట్స్, హోటల్స్ సుమారు 50 వరకు ఉన్నాయి. వీటిలో పూర్తి స్థాయి అనుమతులు ఎవరికున్నాయో సంబంధిత అధికారులే చెప్పాలి.

రాజుగారి పాలల్లో నీళ్లు

తీరప్రాంతంలో రిసార్ట్స్, హోటల్స్ నిర్మాణాలు, నిర్వహణకు సంబంధించి పక్కాగా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని అనుమతులు



సీఆర్‌జడ్ పరిధిలోని నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాఘవరెడ్డి, తహసీల్దార్ గోపీకృష్ణ

ఇవ్వాల్సిన, పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖల అధికారులు రాజుగారి పాలల్లో నీళ్లు అన్న చందంగా తమ విధులను నిర్వహిస్తున్నారని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. జరుగుతున్న పరిణామాలు అందుకు దర్పణం పడుతున్నాయి. ఇదిలావుంటే మేము అన్ని శాఖల వారికి వారు కోరినపుడు ఉచితంగా రూములు, మంచి, చెడులు చూస్తుంటాం కదా అందుకని చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటారని పలువురు వ్యాఖ్యానించటం వారి గడసరి తనానికి నిదర్శనమని వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కందిరీగ తుట్టెను కదలించినట్లే

తీరప్రాంతంలో రిసార్ట్‌లు, హోటల్స్‌కు సంబంధించిన నిర్వాహకులలో సింహభాగం బడాబాబులే. వారు పాలక, ప్రతిపక్షాలలో కీలక భూమిక పోషించే వ్యక్తులే. అధికారంలో ఏ పార్టీ ఉన్నా డైరెక్ట్‌గా మేము సీఎం పేషీ నుంచి చెప్పించుకుంటామని కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానించడం వారి లేక్కలేని తనానికి పరాకాష్ట. ఇదిలావుంటే అనుమతులు లేకుండా ముందు నిర్మించినవారిని ఏదన్నా చేస్తేనే కదా మాపై కూడా చర్యలు చేపట్టేది, కదిలస్తే కందిరీగల తుట్టెను కదిలించేనట్లేనని కొందరు అంటున్నారు. గత ఎన్నికల ఫలితాల ముందు వరకు వైసీపీలో ఉండి, తాజాగా టీడీపీతో జతకట్టిన ఓ నాయకుడు వేటపాలెం మండలం రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం మధ్య, మరో ఇద్దరు చీరాల మండలం వాడరేవు తీరం సమీపంలో వేర్వేరుగా సీఆర్‌జడ్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడం విశేషం. అయతే నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు మాట్లాడరో వారే చెప్పాలి.

వాడరేవులో పరిశీలించిన అధికారులు

వాడరేవు తీరంలో అనధికారికంగా, అనుమతులే లేకుండా చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం ఆర్డీవో చ్రందశేఖర్‌నాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, చీరాల మండల తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ, పంచాయతీ రికార్డుల ప్రకారం స్థానికంగా చేపట్టిన నిర్మాణాల వివరాలు, వారికున్న అనుమతులు తదితరాలపై విచారణ జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ నిర్మాణాలు చేపట్టినా తొలగిస్తామని, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ప్రాథమికంగా వారికి నిర్ణీత నిర్మాణాలకు అనుమతులు లేవని తేలిందని తెలిపారు. ఈ క్రమంలో నియోజకవర్గ పరిధిలోని సంబంధిత రెవెన్యూ, మండల పరిషత్ తదితర బాధ్యులతో సీఆర్‌జడ్ ఉల్లంఘనలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టేందుకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

వాహనదారులకు ఎస్ఐ కౌన్సెలింగ్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులకు ఈపురుపాలెం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. శుక్రవారం స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన దారులతో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం యజమానిపై ఆధారపడి ఉంటుందని, ఈక్రమంలో ప్రయాణాలు సాగించే ముందు కుటుంబాల గురించి ఆలోచించి జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరుపాలెం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మనపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబ సభ్యులు బాధ్యతలు మనవని అవి నెరవేర్చాలంటే నిర్లక్ష్యం వదలాలని సూచించారు. ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలను వివరించి, జాగ్రత్తలు సూచించారు. ఎస్సై వెంట ఏఎస్సై శివ కుమారి, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

నేడు ఏలూరి క్యాంప్ ఆఫీస్‌లో జాబ్ ఫెయిర్

మార్టూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుకున్న నిరుద్యోగులైన యువతీ యువకుల కోసం శనివారం ఉదయం 8 గంటలకు మండల పరిధిలో ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జాబ్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఏలూరి క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ హెచ్‌ఆర్‌కో కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో టెక్‌మహీంద్ర కంపెనీ ఈ జాబ్‌ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు వల్లాపల్లిలో పారిశుధ్య పనులు

బల్లికురవ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వల్లాపల్లి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు శనివారం ప్రత్యేక ప్రారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎంపీడీవో కుసుమకమారి తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం ఒక గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

ఖాజున్నీసా బీబీ మృతిపై ఏలూరి సంతాపం



ఖాజున్నీసా బీబీ

చినగంజాం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్ సతీమణి సయ్యద్ ఖాజున్నీసా బీబీ(50) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నీలాయపాలెం, చినగంజాం, చింతగుంపల్లి గ్రామ సర్పంచ్‌లు తూమాటి శ్రీనివాసరావు, రాయని ఆత్మారావు, యార్లగడ్డ సత్యనారాయణ, నాయకులు సందు శ్రీనివాసరావు, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, కే.భాస్కరరెడ్డి, నరహరి శ్రీనివాసరావు, దేవతోటి నాగరాజు పలు గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు ఖాజున్నీసా బీబీ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అబ్దుల్‌కలాం అజాద్‌ని పరామర్శించారు.

రూ.4లక్షలతో మరుగుదొడ్ల ఆధునికీకరణ

ఇంకొల్లు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండులో 1993లో నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగా శిథిలావస్థ చేరడంతో రూ.4 లక్షలతో వాటిని ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామల తెలిపారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని మరో వారం రోజులలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మరుగుదొడ్లలో సీట్లు, టైల్స్, నూతన పైపులైన్లు ఏర్పాట్లతో పాటు అధునాతన సౌకర్యాలతో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

మార్టూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం అర్ధరాత్రి పెట్రోలు బంకు వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులపై ఆరుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరచిన ఘటన జరిగింది. గ్రామంలో గురువారం తిరునాళ్ల జరుగుతుండడంతో అర్ధరాత్రి సమయంలో మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన దేసిబోయిన శ్రీనివాస్, చిట్టిబోయిన వెంకటేష్‌తో పాటు మరో నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై పెట్రోలు బంకు వద్దకు వచ్చారు.ఈ సమయంలో వారు పెట్రోలు పోయించుకునే విషయంలో ఘర్షణ పడుతూ పెట్రోలు బంకుకు చెందిన ముగ్గురు వ్యక్తులు పెంట్యాల నాగేశ్వరరావు, బోలే నరసింహారావు, ముప్పవరపు ఉదయ భాస్కర్‌పై దాడి చేసి గాయపరచారు. దాంతో పెంట్యాల నాగేశ్వరరావు స్టేషన్‌లో 6 గురు యువకులపై ఫిర్యాదు చేశారు. అనంతరం గాయపడిన ముగ్గురినీ పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషగిరిరావు శుక్రవారం తెలిపారు.

ద్విచక్రవాహనదారుడు మృతి

అద్దంకి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వస్తున్న మాగంటి గురవయ్య (29) అనే వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతను మృతిచెందిన సంఘటన శుక్రవారం ఉదయం అద్దంకి మండల పరిదిలోని చక్రాయపాలెం వద్ద జరిగింది. గురవయ్యకు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. అతను భార్య, తల్లితో చినకొత్తపల్లిలో నివాసం ఉంటున్నాడు. అద్దంకి లోని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం అద్దంకి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఘటనా స్థలానికి సీఐ సుబ్బరాజు, ఎస్ఐ ఖాదర్‌బాషా వచ్చి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురవయ్య భార్య హేమలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కదిలే రైలులో చోరీకి యత్నం

- దుండగుడిని పట్టుకునేందుకు రైలు నుంచి దూకిన తండ్రీ, కూతురు
- తండ్రికి స్వల్ప గాయాలు, తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుడే కదులుతున్న రైలులో సెల్‌ఫోన్‌ను అపహరించి బయటకు దూకాడు ఓ దుండగుడు. అయితే అతనని పట్టుకునేందుకు కూతురు, తండ్రి ఒకరి తరువాత ఒకరు దూకారు. అయితే రైలు చిన్నగా కదులుతుండడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెందిన మల్లికార్జునరావు, కుమార్తెను తీసుకుని శుక్రవారం బాపట్లలోని బంధువుల వద్దకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఒంగోలు వచ్చేందుకు పూరీ - తిరుపతి రైలు ఎక్కారు. ఈక్రమంలో వారిని అప్పటికే గమనిస్తున్న ఓ దుండగుడు రైలు చిన్నగా కదులుతూ చీరాల ఫైర్ గేటు సమీపానికి రాగానే కుమార్తె చేతులో ఉన్న ఫోన్ లాక్కుని బయటకు దూకాడు. బిగ్గరగా కేకలు వేసిన కుమార్తె అతడిని పట్టుకునేందుకు ఆమె కూడా బయటకు దూకింది. దీంతో కుమార్తె కోసం తండ్రి మల్లికార్జునరావు కూడా బయటకు దూకాడు. దుండగుడి కోసం పదిమీటర్లు వరకు కుమార్తె వెంబడించగా దుండగుడు ఫోన్ వదిలేసి పరారయ్యాడు. కుమార్తెకు సురక్షితంగానే ఉండగా, తండ్రి కాలికి రాయి గుచ్చుకుని రక్త గాయమైంది. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో చేరి, చికిత్స పొందగా, రైల్వే పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు.



జాతీయ రహదారికి ఇరువైపులా స్ట్రక్చర్లను తొలగిస్తున్న అధికారులు

బీఆర్‌పాలెం వద్ద డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు

ఎన్‌హెచ్-16లో స్ట్రక్చర్ల తొలగింపు

పంగులూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామం వద్ద శుక్రవారం 16వ నెంబరు జాతీయ రహదారి స్థలంలో ఇరువైపులా ఉన్న గృహాలు, రేకుల షెడ్లు, ఇతర నిర్మాణాలను తొలగించే చర్యలు చేపట్టారు. 2010-11 సంవత్సరంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నష్ట పరిహారం చెల్లించి సేకరించిన స్థలంలో ఉన్న కట్టడాలను తొలగిస్తున్నట్లు తహసీల్దార్ సింగారావు, హైవే సైట్ ఇంజనీర్ హస్సాన్ తెలిపారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేని కారణంగా గ్రామం నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నీరు వెలుపలకు వెళ్లే పరిస్థితి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నివాస గృహాల ముందు నీరు నిలిచి పడుతున్న ఇబ్బందులను గ్రామస్థులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వివరించారు. దీనిపై మంత్రి రవికుమార్ స్పందించారు. వెంటనే కచ్చా డ్రైన్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 8న రోడ్డుకు ఇరువైపులా సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించామని, తదుపరి చర్యల నిమిత్తం అడ్డుగా ఉన్న స్ట్రక్చర్లను క్రేన్ ద్వారా తొలగిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌బాబు, టోల్ మేనేజర్ ఆనందరావు, రూట్ ఆపరేటర్ నర్సింగరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడదాం

వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ప్రజల పక్షాన నిలబడి.. మనవంతు పాత్ర పోషిద్దామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి బాధ్యతతో ముందుకు సాగుదామని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిధిలో వైసీపీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

అద్దంకిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా శనివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉదయం 10 గంటలుకు జాగర్లమూడివారిపాలెం, తరువాత 11 గంటలకు శింగరకొండపాలెం గ్రామాలలో జరగనున్న కార్యక్రమాలలో పాల్గొంటారని టీడీపీ నాయకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

బస్టాండ్‌లో స్వచ్ఛ ఆంధ్ర

ఇంకొల్లు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకొల్లు బస్టాండ్‌లో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి పరిసరాలు శుభ్రం చేసారు. ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొని పనులు పర్యవేక్షించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సబ్సిడీపై ఇచ్చే రుణాలు ఆన్‌లైన్‌లో అర్హులైనవారు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), జనవరి 17(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం దేశాయిపేటలో శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మేళతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం

- వేలాదిగా పాల్గొన్న భక్తులు
- పూలతో పసుపు మయంగా పురవీధులు



చందలూరు పురవీధుల్లో ఊరేగుతున్న మహాలక్ష్మి అమ్మవారు

పంగులూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి పాలవెల్లి మహోత్సవం తొమ్మిదవ రోజు శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మేళతాళాలతో సాగిన అమ్మవారి గ్రామోత్సవంలో వేలాది మంది భక్తులు అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ పూలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భక్తి పారవశ్యంతో అమ్మవారికి సమర్పించిన పూలతో పురవీధులు పసుపు మయమాయ్యాయి. శుక్రరవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల మూలమంత్ర జపం చేసి 11 మంది ముత్తయిదువులకు పూలు, గంధం, కుంకుమలు అర్పించి బాల భోగం నిర్వహించారు. పొంగించిన పాలపై నెయ్యితో కలిపిన మధుర పదార్థం అమ్మవారికి నివేదన గావించి ముత్తయిదువులకు ఆ పదార్థాలను ఒడ్డించారు. అనంతరం ముత్తయిదువులు జల బిందెలతో పురవీధులలో అమ్మవారి గ్రామోత్సవం వెంట రాగా, మేళ తాళాలతో సాగిన ఈ గ్రామోత్సవంలో చందలూరు, పరిసర గ్రామాల ప్రజలు, బంధుమిత్రులు వేలాదిగా పాల్గొని అమ్మవారికి నమస్కరిస్తూ, పూలు చల్లుతూ సాగిన ఉత్సవం తిలకించేందుకు ప్రధాన రహదారికి ఇరువైపులా భక్తులు బారులుతీరారు. కిక్కిరిసిన జన సందోహంతో సాగిన గ్రామోత్సవం తిరునాళ్లను తలపించింది. అమ్మవారు పురంలో కొలువుదీరారు. రాత్రివేళ విద్యుత్ దీపాలతో రూపుదిద్దుకున్న ప్రభవతో పుల్లెల, తాటి వంశస్తులు పుర వీదులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భరత నాట్యం, వీధి డ్యాన్స్‌లతో గ్రామంలో కోలాహలం నెలకుంది.



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీభద్రావతి సమేత భావన్నారాయణస్వామి కల్యాణం

చీరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేరాలలో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సేమేత శ్రీ భావన్నారాయణ స్వామి కల్యాణం వేభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి చీరాల, పేరాల పురవీధుల్లో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జం జనం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయలానికి 100 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఆలయ పుట్టుపుర్వోత్తరాలను వివరించారు. నగరోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, నిర్వాహక ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, మున్సిల్ చైర్మన్ జంజనం తదితరులు

ప్రేమసాగర్‌ను అభినందించిన ఎంపీ దగ్గుమళ్ల

చీరాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రం జలంధర్ లౌలీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలలో 81 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన దేవరకొండ ప్రేమసాగర్‌ను చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం అభినందించారు. ప్రేమసాగర్ చీరాల వాసి కావడం చీరాల ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశం గర్వించేస్థాయికి ప్రేమసాగర్ ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రోత్సహించారు.





రాజనర్తకి నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

అలరించిన నాటిక పోటీలు

బోడవాడ (పర్చూరు), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పౌరాణిక కళాకారులు, నటప్రతాప్ చెరుకూరి శ్రీరాములు చౌదరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మండలం బోడవాడలో గురువారం రాత్రి ప్రదర్శించిన నాటిక పోటీలు ప్రేక్షకులను రంజిపచేశాయి. నేటి సమాజంలో తరగిపోతున్న మానవ విలువలు, సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందించాలన్న సంకల్పంతో సాగిన నాటిక ప్రదర్శనలో కళాకారుల అద్భుతమైన నటను చూపించారు. నాటిక పోటీల అనంతరం భీమినేని యుక్తా చౌదరి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. టీడీపీ నాయకుడు చెరుకూరి శ్రీధర్(చింపయ్య) సారథ్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు.